మంగళవారం
04-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 13
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మా జీతాలు పెంచండి

కోవిడ్ తర్వాత ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయామని, జీతాల్లో కోతలు తప్ప తమకు యాజమాన్యాలు ఇచ్చినదేమీ లేదని, తమ వేతనాలను తక్షణమే పెంచాలన్న డిమాండ్‌తో దక్షిణ కాలిఫోర్నియాలో హోటల్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. మెరుగైన వసతులు, సంక్షేమానికి డిమాండ్ చేశారు. యాజమాన్యాల తీరును దుయ్యబట్టారు. వేలాది మంది రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు.

2 లో

17, 18 తేదీల్లో బెంగళూరులో

విపక్షాల తదుపరి భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల తదుపరి సమావేశం జులై 17, 18 తేదీల్లో బెంగళూరులో జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సోమవారం ప్రకటించింది. ముంబై పరిణామాలతో బీజేపీని ఓడించాలన్న సంకల్పం మరింత బలీయమైందని స్పష్టంచేసింది. ప్రతిపక్షాల సమావేశం తేదీలను ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఫాసిస్టు, అప్రజాస్వామిక శక్తులను ఓడించే దిశగా మొక్కవోని దీక్షతో ప్రతిపక్షాలు ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించిన సమావేశం విజయవంతమైందని, తదుపరి సమావేశం కర్నాటక రాజధాని బెంగళూరులో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మరోవైపు, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే కేబినెట్‌లోకి ఎన్‌సీపీ నేత అజిత్ పవార్, మరో 8 మందిని బీజేపీ చేర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ మరో ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. 'ఐసీఈ(ఆదాయపన్నుశాఖ, సీబీఐ, ఈడీ) డిటర్జెంట్‌తో ముంబైలో బీజేపీ వాషింగ్ మిషన్ పని నిన్న తిరిగి ప్రారంభమైంది. ప్రతిపక్ష ఐక్యతపై

- మిగతా 2 లో

రాజకీయ పార్టీల కోసం ఆన్‌లైన్ పోర్టల్

- ఇందులోనే ఆర్థిక వివరాలు వెల్లడించాలి
- పారదర్శకత కోసమేనన్న ఈసీ

న్యూఢిల్లీ: రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు చందా నివేదికలు, ఆడిట్ చేసిన వార్షిక ఖాతాలు, ఎన్నికల వ్యయ ప్రకటనలతో సహా తమ ఆర్థిక నివేదికలను దాఖలు చేయడానికి అనుమతించడానికి ఎన్నికల సంఘం సోమవారం ఒక పోర్టల్‌ను ప్రారంభించింది. ఇది రాజకీయ సంస్థల వెల్లడిలో మరింత పారదర్శకతను తీసుకువచ్చే ప్రయత్నంగా పరిగణించబడుతుంది. 'సమగ్ర ఎన్నికల వ్యయ పర్యవేక్షణ వ్యవస్థ' అనేది ఎన్నికల సంఘం '3సి స్ట్రాటజీ'లో భాగం. ఇది ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కింద ఒక సంవత్సరం పాటు పని చేస్తున్న రాజకీయ నిధులు, ఖర్చులలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడానికి, సమ్మతిని కలిగి ఉంటుంది' అని ఆ వర్గాలు తెలిపాయి. 'ఆన్ లైన్ పద్ధతి ద్వారా ఆర్థిక నివేదికను దాఖలు చేయకూడదనుకునే రాజకీయ

- మిగతా 2 లో

కదులుతున్న

షిండే పీఠం

ముంబై: గత ఏడాది జూన్ 22న శివసేనను చీల్చి ఏక్ నాథ్ షిండే ముఖ్యమంత్రి అయిపోయారు. ఆయన తన వెంట 40 మంది శాసనసభ్యులను తీసుకెళ్లానని చెప్పారు. నిజానికి అప్పటికే 105 మంది సభ్యులతో బీజేపీ శాసనసభలో అతి పెద్ద పార్టీ. కానీ బీజేపీ అసలు లక్ష్యం ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టడమే కనక తమ బలంలో సగమైనాలేని శివసేన వర్గం నాయకుడైన ఏక్ నాథ్ షిండేను ముఖ్యమంత్రిని చేయడానికి అంగీకరించింది. మహారాష్ట్రలో బీజేపీ అగ్ర నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ అధిష్ఠానం మాటవిని ఉప ముఖ్యమంత్రి పదవితో రాజీపడక తప్పలేదు. ఇప్పుడు అజిత్ పవార్ నాయకత్వంలో ఎన్సీపీకి చెందిన దాదాపు 40 మంది పార్టీ ఫిరాయించారు. అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి, మరో ఎనిమిది మంది మంత్రులై పోయారు. అందువల్ల షిండే సహాయం ఇక బీజేపీకి అక్కర్లేదు. ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడానికి ఒప్పుకోవడంవల్ల బీజేపీ శివసేనను చీల్చే అసలు లక్ష్యం సాధించేసింది. ఇప్పుడు ఎన్సీపీని చీల్చింది.

ఇక షిండేతో పనేముంటుంది?

ఏక్‌నాథ్ షిండే అధికారంలోకి వచ్చి ఏడాది అయింది. ఆయన వర్గంలోని వారు మంత్రిపదవుల మీద ఆశ పెంచుకున్నారు. ఇప్పుడు అజిత్ పవార్ వర్గం మద్దతు ఉంది కనక షిండే మద్దతుదార్లకు పదవులు ఇవ్వకుండా ఉన్నా చేయగలిగింది ఏమీ లేదు. అంటే అజిత్ పవార్ వర్గం ప్రభుత్వంలో చేరడంతో షిండే వర్గానికే ప్రమాదం పొంచి ఉందనుకోవాలి. తన వర్గానికి మంత్రిపదవులు ఇప్పించడం ఇక సాధ్యం కాకపోవచ్చు. అలాంటప్పుడు ఆయన మద్దతుదార్లు ఆయనతో కొనసాగకపోవచ్చు. కొద్ది రోజుల ముందే షిండే ప్రభుత్వానికి ఏడాది నిండింది కనక ఆయన అనుయాయులకు మంత్రిపదవులు దక్కుతాయనుకున్నారు. కానీ అజిత్ పవార్ వచ్చి చేరడంతో ఇక ఆ అవకాశం ఉండకపోవచ్చు. మరో వేపు అజిత్ పవార్ కు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని బీజేపీ వాగ్దానం చేసిందన్న సమాచారం అందుతోంది. అప్పుడైనా షిండేకు ఉద్వాసన తప్పదు. అజిత్ పవార్ వెంటబెట్టుకొచ్చిన 40 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి అంత ప్రధానం కాదు. వారిలో ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ నరహరి జిహ్వాల్, శాసనమండలి అధ్యక్షుడు రాం రాజ్ నింబాల్కర్, ఎన్సీపీ కోశాధికారి సునీల్ తట్కర్ లాంటి దిగ్గంతలు ఉన్నారు. సునీల్ తట్కరే ఎంపీ. ఆయన కూతురు అదితి తట్కరే నిన్ననే మంత్రి అయిపోయారు.

షిండే స్థానంలో అజిత్ పవార్ ను ముఖ్యమంత్రిని చేస్తారని ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ అంటున్నారు. దీనికి తోడు షిండే వర్గం శాసనసభ్యులందరినీ అనర్హులుగా ప్రకటించే ప్రమాదం ఇంకా ఉండనే ఉంది. బీజేపీ నాయకుడు, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కన్నా తనకే ఎక్కువ జనాదరణ ఉంది అని షిండే ప్రచారం చేసుకోవడం, ఈ మేరకు దేశంలో మోదీ, మహారాష్ట్రలో షిండే అని పోస్టరు పత్రికల్లో వ్యాపార ప్రకటనలు వేయించడం కూడా బీజేపీకి ఆగ్రహం తెప్పించే అంశాలే.

సర్పంచుల ముట్టడి

ఉద్రిక్తం

- అడ్డుకున్న పోలీసులు... అరెస్టులు
- ఆర్థిక సంఘం నిధులు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక

విశాలాంధ్ర-తాడేపల్లి: సర్పంచులు తలపెట్టిన పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ... తాడేపల్లిలోని పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి సర్పంచులు ఆందోళనకు దిగారు. దీంతో అనేకమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంతమంది సర్పంచులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వైఖరిపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "హక్కుల కోసం పోరాడుతుంటే అరెస్టు చేస్తారా? రావాల్సిన బకాయిలు, నిధులు వెంటనే విడుదల చేయాలి. 20 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం స్పందించట్లేదు. నిధులు లేక గ్రామాల్లో రోడ్లు కూడా వేయలేని దుస్థితి ఏర్పడింది. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న నిధులు పంచాయతీ ఖాతాల్లో వేయాలి" అని సర్పంచులు డిమాండ్ చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.691 కోట్లు వచ్చి 40 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అధ్వర్యంలో సోమవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఒక్కసారిగా వందలాది మంది సర్పంచులు పంచాయతీరాజ్ కమిషనరేట్ వైపు దూసుకు రావటంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్టు అరెస్ట్ చేసి పెదకాకాని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల ఆధీనంలో గ్రామ సచివాలయాల కార్యకలాపాలు జరగాలని, సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని రూ.3వేల నుంచి రూ.15 వేలుకు పెంచాలని, మైనర్ పంచాయతీల కరెంట్ బిల్లులు, తాగునీటి సరఫరా, వీధిలైట్లు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. గ్రామ సచివాలయాలపై వచ్చే ఆదాయాన్ని పంచాయతీల ఖాతాల్లోనే జమ చేయాలని, గిరిజన తండాలను ప్రత్యేకంగా పరిగణించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి పంచాయతీలకు నిధులు ఆపిన చరిత్ర లేదని అన్నారు. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లందరూ వారి ఫోన్లపై 'జగనన్న మా నమ్మకం' స్టిక్కర్లు అతికించుకోవడం జరిగిందని, కానీ ఆ నమ్మకాన్ని జగన్‌మోహన్ రెడ్డి పోగొట్టుకున్నారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల కావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు(న్యూఢిల్లీ) డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూ విజయ్ కుమార్, కార్యదర్శి టి.కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు అప్పి రెడ్డి, అల్లాబక్షు, కె.ధర్మరాజు, రమేష్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘ నాయకులు ముప్పాళ్ల మనోహర్, తోకల సరోజినీ నరసింహారావు, జయరాం రెడ్డి, సురేషు రామకృష్ణ, రాముడు, జానకి దేవి, నాగమణి, శ్రీనివాసరెడ్డి, సొంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు జగన్ క్షమాపణ చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

2 లో

వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ సరుకులకు క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి

3 లో

సిగ్నలింగ్ లోపాలే కారణం

ఒడిశాలో రైలు దుర్ఘటనపై విచారణ కమిటీ నివేదిక

2 లో

చైనాతో సహకారం ప్రాధాన్యం

తాంజానియా, జాంజిబర్ అధ్యక్షుడు హుస్సేన్

2 లో

ఇదీ లోకం!

సార్.. నేను మీకు పథకాలతో నిమిత్తం లేకుండా, డప్పు వాయిస్తూ భజన చేస్తూ ఈ నాలుగేళ్లూ గడిపాను నన్ను ఉంచండి ప్లీజ్!

ఆందోళనకరంగా సైబర్ నేరాలు

- మూడేళ్లలో 22 లక్షల ఫిర్యాదులు
- నమోదయిన ఎఫ్‌ఐఆర్‌లు 2 శాతమే
- కేసుల నమోదులో రాష్ట్రాల అలసత్వం

న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. వాటిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా 2020 నుంచి 2023 మే 15 వరకు ఏకంగా 22,57,808 మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. కానీ వాటిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడంలో రాష్ట్రాలు విఫలమవుతున్నాయి. దేశవ్యాప్తంగా 22 లక్షలకు పైగా ఫిర్యాదులు రాగా, వాటిలో 43,022 కేసులే ఎఫ్‌ఐఆర్‌కు నోచుకున్నాయి. ఇది మొత్తం కేసుల్లో 1.9 శాతమే. ముంబైకి చెందిన ఆర్టీఐ కార్యకర్త జితేంద్ర గఢ్గే సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడంలో అలసత్వం వహిస్తున్నాయి. దేశంలోని చాలా రాష్ట్రాల్లో 2 శాతం కూడా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయకపోగా, తెలంగాణ పోలీసులు తమకు అందిన మొత్తం ఫిర్యాదుల్లో 17 శాతం ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి రాష్ట్రాన్ని ప్రథమ

- మిగతా 2 లో

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ అధ్వర్యాన పుట్టపర్తిలో భారీ ర్యాలీ, ధర్నా

2 లో

మా జీతాలు పెంచండి

దక్షిణ కాలిఫోర్నియాలో హోటల్ వర్కర్ల డిమాండ్ - సమ్మె

లాస్ ఏంజిల్స్: కోవిడ్ తర్వాత ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయామని, జీతాల్లో కోతలు తప్ప తమకు యాజమాన్యాలు ఇచ్చినదేమీ లేదని, తమ వేతనాలను తక్షణమే పెంచాలన్న డిమాండ్‌తో దక్షిణ కాలిఫోర్నియాలో హోటల్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. మెరుగైన వసతులు, సంక్షేమానికి డిమాండ్ చేశారు. యాజమాన్యాల తీరును దుయ్యబట్టారు. వేలాది మంది రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. మెరుగైన వేతనాల కోసం ప్లకార్డులతో కదం తొక్కారు. పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఫోర్త్ ఆఫ్ జులై హాలిడే సందర్భంగా పర్యాటకుల తాకిడి పెరిగిన సమయంలో హోటల్ వర్కర్లు ఆందోళనకు దిగడంతో సుమారు 65 పెద్ద హోటళ్లపై ప్రభావం కనిపించింది. నాలుగు రోజుల సెలవులు ముగిసే వరకు విధులకు హాజరయ్యేది లేదని నిరసనకారులు తేల్చిచెప్పారు. యజమానుల అత్యాస తమకు శాపంగా మారిందని దక్షిణ కాలిఫోర్నియా, ఆరిజోనాలోని 32,000 మందికిపైగా వర్కర్లకు ప్రాతినిధ్యం వహించే యునైట్ హియర్ లోకల్ 11 సహ-అధ్యక్షుడు కర్ట్ పీటర్‌సెన్ వ్యాఖ్యానించారు. పరిశ్రమకు బయిలౌట్లు లభిస్తే తమకు దక్కినది కోతలన్నారు. వర్కర్లతో రాజీకి ప్రయత్నించకపోవడం సిగ్గుచేటన్నారు. తాజా సమ్మెలో 15వేల మంది పాల్గొన్నారని, లాస్ ఏంజిల్స్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న ఆరెంజ్ కౌంటీస్‌తో సహా రిట్స్ కార్లోట్టన్, హిల్టన్, మారియట్, ఫోర్ సీజన్స్ తదితర 65 ప్రధాన హోటళ్లు ప్రభావితమయ్యాయని కార్మిక సంఘం తెలిపింది. వర్కర్ల సమ్మెకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. 'కార్మికులు హక్కులపై దాడులు జరిగినప్పుడు ఏం చేస్తాం? పోరాడతాం' హ్యాష్‌ట్యాగ్ సోకాల్ హోటల్ స్ట్రైక్' పోస్టులు వైరలయ్యాయి.

చైనాతో సహకారం ప్రాధాన్యం

తాంజానియా, జాంజిబర్ అధ్యక్షుడు హుస్సేన్

చాంగ్‌షా: చైనాతో సహకార బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని, పరస్పరం సహకరించుకుంటూ ముందు కెళతామని తాంజానియా, జాంజిబర్ అధ్యక్షుడు హుస్సేన్ అలీ మిన్వి అన్నారు. పూర్వకాలం నుంచి చైనా, ఆఫ్రికా మధ్య పటిష్ఠ సహకార బంధముందన్నారు. ఆదివారంతో ముగిసిన చైనా-ఆఫ్రికా ఆర్థిక, వాణిజ్య ఎక్స్‌పోలో పాల్గొన్న హుస్సేన్ తన చైనా పర్యటన క్రమంలో జిన్హువా వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. దశాబ్దాలుగా చైనాతో సహకార బంధాన్ని కలిగివున్నట్లు తెలిపారు. ఈ వైఖరిలో ఎలాంటి మార్పులేదన్నారు. తమ సిద్ధాంతాలు అనుకూలంగానే ఉంటాయని, చైనాతో కలిసి పనిచేస్తామని, ఆ దేశంతో దగ్గర సంబంధాలను కలిగివుండటాన్ని అదృష్టంగా భావిస్తామని హుస్సేన్ అన్నారు. కొవిడ్ తర్వాత పరిస్థితుల్లో కుదేలైన చైనా ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకోగలగడంతో ఆఫ్రికాకూ ఆర్థికంగా పుంజుకునే అవకాశాలు లభిస్తాయని అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. స్వీయ సమృద్ధి సాధించడమే ఆఫ్రికా దేశాల లక్ష్యమని నొక్కిచెప్పారు. ఈ క్రమంలో చైనాతో భాగస్వామ్యం తమకు అత్యంత ప్రధానమని చెప్పారు. చైనా సాధించిన విజయాలు ప్రశంసించదగినవిగా తెలిపారు. ఆర్థిక వృద్ధిరేటు మెరుగైందని, అన్ని రంగాల్లో గణనీమయైన వృద్ధి కనిపిస్తోందని చైనా దేశం గురించి చెప్పారు. చైనా ఆధునికీకరణను మెచ్చుకున్నారు. కొన్ని లక్షల మంది పేదరికం నుంచి బయట పడగలగడం చైనా సాధించిన విజయమని అన్నారు. చైనాతో తాంజానియా సహకారంతో భవిష్యత్‌లో అద్భుత ఫలితాలు వస్తాయని హుస్సేన్ ఆకాంక్షించారు.

ఏఫ్ఏఓ డైరెక్టర్ జనరల్‌గా

క్యూ డాంగ్యూ మళ్లీ ఎన్నిక

రోమ్: ఐక్యరాజ్య సమితి ఆహారం,వ్యవసాయ సంఘం (ఎఫ్ఏఓ) డైరెక్టర్ జనరల్‌గా క్యూ డాంగ్యూ తిరిగి ఎన్నికయ్యారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగే 43వ ఎఫ్ఏఓ సదస్సు క్రమంలో ఆయన ఆదివారం మరోమారు ఈ పదవికి ఎన్నిక జరిగింది. తొలుత 2019 జూన్‌లో క్యూ డైరెక్టర్ జనరల్‌గా ఎన్నిక కాగా ఆ పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి చైనా పౌరుడిగా నిలిచారు. అంతర్జాతీయ ఆహార భద్రత సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. అన్ని దేశాలు ముఖ్యంగా అభివృద్ధి చెందే దేశాలకు ఆహార, వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందించారు. ఆయన సేవలను గుర్తించిన ఎఫ్ఏఓ సభ్యదేశాలు మరోమారు డైరెక్టర్ జనరల్‌గా క్యూ డాంగ్యూను ఎన్నుకున్నాయి.

సైన్యాధికారుల భర్తీకి సమయం లేదా

మోదీ ప్రభుత్వానికి ఖడ్గే ప్రశ్న

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వానికి పార్టీలను చీల్చేందుకు సమయం ఉందిగానీ సాయుధ దళాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు మాత్రం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విమర్శించారు. సైన్యంలో మేజర్, కెప్టెన్ స్థాయి అధికారుల కొరత తీవ్రంగా ఉండటాన్ని ప్రస్తావించారు. ఈ మేరకు వెలువెడిన నివేదికను ట్వీట్ చేశారు. 'సైన్యంలో మేజర్, కెప్టెన్ స్థాయి అధికారుల కొరత తీవ్రంగా ఉంది. శాఖల్లో సిబ్బంది కొరతను తీర్చేందుకు వివిధ కేంద్ర కార్యాలయాల్లో స్టాఫ్ ఆఫీసర్ల నియామకాలను తగ్గించాలని, తిరిగి విధుల్లోకి తీసుకున్న అధికారులను అలాంటి పదవుల్లో నియమించాలని సైన్యం ఆలోచిస్తోంది' అని నివేదిక పేర్కొంది. దీనిపై మోదీ ప్రభుత్వాన్ని ఖడ్గే విమర్శించారు. ఎప్పుడూ జాతీయవాదాన్ని ఊదరగొట్టేవారు సాయుధ దళాలను మోసం చేశారని ట్వీట్ చేశారు. 'సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో రెండు లక్షలకుపైగా ఖాళీలు ఉన్నాయి. దేశ సైనికుల కోసం మోదీ ప్రభుత్వం వద్ద నిధులు లేవనేందుకు అగ్నిపథ్ పథకం నిదర్శనం. ఓఆర్‌ఓపీ అమలులో సైనికులను మోదీ ప్రభుత్వం మోసగించింది. ఓఆర్‌ఓపీ-2లో తేడాలతో వీరజవాన్లను విభజించింది.మోదీ ప్రభుత్వానికి, బీజేపీకి దేశ భద్రత అంటే జాతీయంగా ప్రధానమైన అంశం కాబోదు. ప్రభుత్వాలను కూల్చడం, పార్టీలను చీల్చడమే వాటికి ముఖ్యమని ఖడ్గే వ్యాఖ్యానించారు.

ఆందోళనకరంగా సైబర్ నేరాలు

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో నిలిపారు. బాధితులకు న్యాయం చేయడంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నారు. సైబర్‌క్రైమ్ నేరాలపై ఫిర్యాదులకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను 2020లో జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తీసుకొచ్చింది. ఈ పోర్టల్ వేదికగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయవచ్చు. ఇది పోలీసులకు ఫిర్యాదుదారులకు మధ్య అనుసంధానకర్తగా ఉంటుంది. ఆన్‌లైన్ చైల్డ్ ఫోర్నోగ్రఫీ, పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, సామూహిక లైంగికదాడి, సోషల్ మీడియా నేరాలు, ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలు, క్రిప్టో కరెన్సీ మోసాలు తదితర సైబర్ నేరాలపై ఫిర్యాదులు చేసేందుకు ఈ పోర్టల్‌ను ఆశ్రయించవచ్చు.

లైంగిక దాడులపై 154 ఎఫ్ఐఆర్‌లే నమోదు

దేశవ్యాప్తంగా లైంగిక దాడులపై 1,58,190 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 0.09 శాతం అనగా 154 ఎఫ్ఐఆర్‌లే నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతున్నది. వీటిలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 67,082 మంది ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత తమిళనాడు (12,785), మహారాష్ట్ర (10,878) నుంచి ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. వరుసగా ఈ రాష్ట్రాలు 13, 3, 9 ఎఫ్ఐఆర్‌లే నమోదు చేయడం గమనార్హం. ఇతర సైబర్ నేరాలపై 20,99,618 మంది ఫిర్యాదులు చేయగా, 42,868 ఎఫ్ఐఆర్‌లే నమోదయ్యాయి. ఇది మొత్తం కేసుల్లో 2 శాతమే. ఉత్తరప్రదేశ్ (3,84,942), ఢిల్లీ (2,16,739), మహారాష్ట్ర (1,95,409) వరుసగా అత్యధిక ఫిర్యాదులతో మొదటి వరుసలో నిలిచాయి.

విపక్షాల తదుపరి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రేరేపిత సంతాప సందేశాలు వచ్చాయి. కానీ వాటిని రాసిన వారికి నిరాశ తప్పబోదు. జూన్ 23న పాట్నాలో జరిగినట్లే ఈనెల 17, 18 తేదీల్లో బెంగళూరులో విపక్షాలు భేటీ కానున్నాయి' అని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. ముంబై పరిణామాలు ప్రతిపక్షాల ఐక్యతను మరింత దృఢత్వం చేసోందని వ్యాఖ్యానించారు. 'బెంగళూరు సమావేశం... అందరి కోసం మనం... మన కోసం అందరు' అంటూ వేణుగోపాల్ ట్వీట్‌ను టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ ట్యాగ్ చేశారు. కాగా, బెంగళూరు భేటీ 13, 14 తేదీల్లో జరుగుతుందని ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ ఇంతకుముందు ప్రకటించిన విషయం విదితమే.

రాజకీయ పార్టీల కోసం ఆన్‌లైన్ పోర్టల్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలు అలా చేయకపోవడానికి గల కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలి. నిర్దేశించిన ఫార్మాట్‌లలో సీడీలు లేదా పెన్ డ్రైవ్‌లతో పాటు హార్డ్ కాపీ ఫార్మాట్‌లో నివేదికలను దాఖలు చేయడం కొనసాగించవచ్చు. 'ఆన్ లైన్‌లో ఆర్థిక నివేదికలను దాఖలు చేయనందుకు పార్టీ పంపిన సమర్థన లేఖతో పాటు అటువంటి అన్ని నివేదికలను ఆన్ లైన్‌లో ప్రచురిస్తుంది' అని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. రాజకీయ పార్టీలు చందా నివేదికలు, ఆడిట్ చేయబడిన వార్షిక ఖాతా, ఎన్నికల వ్యయ ప్రకటనలను ఆన్‌లైన్‌లో దాఖలు చేయడానికి పోర్టల్ సులభతరం చేస్తుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951, ఎన్నికల సంఘం జారీ చేసిన పారదర్శకత మార్గదర్శకాల ప్రకారం, ఈ ఆర్థిక నివేదికలను రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఈసీ తెలిపింది. అనేక రాజకీయ పార్టీలు అవసరమైన ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆర్థిక నివేదికలను దాఖలు చేయకపోవడం లేదా ఆలస్యమైన, సరిపోని లేదా అసంపూర్ణమైన వివరాలను కూడా ప్రామాణికం కాని పద్ధతిలో దాఖలు చేసిన అనేక సందర్భాలు దృష్టికి వచ్చాయని వర్గాలు తెలిపాయి. పోర్టల్ ద్వారా చట్టబద్ధమైన నిబంధనలను దుర్వినియోగం చేయడం, పన్ను మోసాలు, పార్టీల ఎగవేతలపై నిఘాను సులభతరం చేయాలని ఈసీ యోచిస్తోంది. తాజా చొరవ ద్వారా పార్టీల ఆర్థిక వ్యవహారాలపై ఓటర్లకు సమాచారం, అవగాహన కల్పించడం ద్వారా పార్టీల ద్వారా సమయానుకూలంగా ఆర్థిక వెల్లడి చేస్తుందని ఈసీ విశ్వసిస్తోంది.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

విశాలాంధ్ర - పుట్టపర్తి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు, సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం పుట్టపర్తిలో భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. గణేష్ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అర్హులందరికీ నివేశ స్థలాలు, సాగు పట్టాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇళ్లు కాదు ఊర్లు నిర్మిస్తామని సీఎం జగన్ చెబితే సంతోష పడ్డామని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన ఎక్కడైనా ఒకటో వంతు ఇళ్లు నిర్మించారా అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా 62వేల ఇల్లు మంజూరయ్యాయనీ, అందులో 12000 వేలు ఇల్లు మాత్రం నిర్మాణం జరుగుతున్నాయని అధికారులు చెప్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 32 మండలాలలో పేదల సాగు చేసుకుంటున్న సాగు భూములకు పట్టాలి ఇవ్వలేదని, అధికార పార్టీ నాయకుల అడుగుల మడుగులు వారికే పట్టాలిస్తున్నారన్నారు. కర్నాటక మద్యాన్ని ఇక్కడికి తరలించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న పాలకులు ఇక్కడ ఇసుకను కర్నాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తప్పుపట్టారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి నివేశస్థలాలు సాగు పట్టాలు ఇచ్చేవరకు సీపీఐ పేదలకు అండగా ఉండి వారి పక్షాన పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవో భాగ్యరేఖ ధర్నా దగ్గరకు చేరుకుని నిజమైన లబ్దిదారులు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులందరూ కలిసి కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, గంగాధర్, జయలక్ష్మి, కుళ్లాయప్ప, శ్రీరాములు, మధు, మహదేవ్, శివప్ప, వినోద్ నాయకులు కుళ్లాయప్ప, ఈశ్వరమ్మ, లక్ష్మి, వెంకటనారాయణ, గోసలాజం తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఏదైనా పత్రాన్ని

సమర్పించారో లేదో తేల్చండి

ది వైర్ ఎడిటర్‌పై పరువునష్టం కేసులో జేఎన్‌యూకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: 2017లో ది వైర్ సంపాదకులు, ఉప సంపాదకులపై జెఎన్‌యూ పూర్వ ప్రొఫెసర్ అమృతా సింగ్ పెట్టిన పరువునష్టం కేసును సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. అసలు ప్రొఫెసర్ ఏమైన పత్రాన్ని యూనివర్సిటీకి సమర్పించారో లేదో తేల్చాలని జేఎన్‌యూ పాలనా యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. విశ్వవిద్యాలయాన్ని వ్యభిచారానికి అడ్డాగా పేర్కొంటూ 2016, ఏప్రిల్‌లో 'డాసియర్ కాల్ జేఎన్‌యూ....' శీర్షికన ప్రచురితమైన వ్యాసం క్రమంలో సంపాదకులు సిద్ధార్థ భాటియా, ఉపసంపాదకులు అజయ్ ఆషిర్వాద్‌పై సింగ్ కేసు పెట్టారు. తన పరువు తీసేందుకు వారు ఇలా చేశారని ఆరోపించారు. ఈ కేసులో భాటియా, ఆషిర్వాద్‌కు సమన్లు జారీ కాగా వాటిని ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సింగ్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. నిజనిజాలను నిర్ధారించకుండా వివరాలను ప్రచురించారని ఆరోపణలు చేశారు. జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ సుధాంషు ధూలియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేసును విచారించింది. జేఎన్‌యూ వీసీతో పాటు భాటియా, ఆషిర్వాద్‌లకు నోటీసులు జారీచేసింది. 'నోటీసులు ఇచ్చాం. అసలు ఏదేని పత్రాన్నైనా విశ్వవిద్యాలయంలో సమర్పించారా లేదా అన్నది వీసీ నుంచి వివరణ కోరుతున్నాం. ఒక వేళ సమర్పిస్తే అది ఎవరికి ఇచ్చారో వెల్లడించాలి' అని ధర్మాసనం పేర్కొంది. 'మీరు అసలు వివరణ పత్రాన్ని సమర్పించారా? అని పిటిషనర్‌ను జస్టిస్ కౌల్ ప్రశ్నించారు. మీరు చేయని పనిని మీరు చేశారని చెప్పినప్పుడు అది పరువు నష్టం కిందకు వస్తుందని తెలిపారు. దీనికి సింగ్ తరఫు న్యాయవాది స్పందిస్తూ ముందు పత్రాన్ని సమర్పించామని చెప్పి తర్వాత ఏ పత్రాన్ని సమర్పించలేదన్నారు. దీనిపై జస్టిస్ కౌల్ స్పందిస్తూ మీరు మమ్మల్ని తికమత పెడుతున్నారు. మీ మాటల్లో స్పష్టత లేదు. పత్రాన్ని సమర్పించారో లేదో చెప్పండి' అని సూటిగా ప్రశ్నించారు. ఇందుకు న్యాయవాది స్పందిస్తూ 'నా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకోవచ్చు. నాకు ఏ పత్రం గురించి తెలియదు' అని అన్నారు. దీంతో జేఎన్‌యూ వీసీ నుంచి సమగ్ర వివరణను కోరుతూ ధర్మాసనం నోటీసులు జారీచేసింది.

మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం నేపథ్యంలో ప్రాధాన్యత

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సోమవారం భేటీ అయింది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈ సమావేశం జరిగింది. కేబినెట్ మంత్రులతో పాటు స్వతంత్ర హోదా కలిగిన మంత్రులు, సహాయ మంత్రులు, ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. దాదాపు ఐదు గంటలపాటు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చర్చలు ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాలపై విస్తృతంగా చర్చించినట్లు వివరించారు. ఈ ఏడాది చివరిలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండటం, కేబినెట్‌లో మార్పులు ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్‌లో మార్పులు-చేర్పులు జరిగిన పక్షంలో మిత్రపక్షాలతో పాటు ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు చెందిన నేతలకు కేబినెట్ విస్తరణలో చోటు కల్పిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, తొమ్మిదేళ్ల పాలన, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో పాటు వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, ఆయా రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు, రాబోయే రోజుల్లో ప్రభుత్వ ప్రాధాన్యాతాంశాలు, ఈ నెల ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, కీలక బిల్లులు సహా ఉమ్మడి పౌరస్మృతి అనేక ముఖ్య విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రూ.2వేల నోట్లలో

76 శాతం వెనక్కి వచ్చాయి: ఆర్బీఐ

ముంబై: ఇప్పటివరకు చలామణీలో ఉన్న రూ.2వేల నోట్లలో 76 శాతం నోట్లు వెనక్కి వచ్చినట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం వెల్లడించింది. రూ.2వేల నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్బీఐ ఇటీవల ప్రకటన చేసిన సంగతి విదితమే. దీంతో ఆ నోట్లన్నీ డిపాజిట్లు, మార్పిడి రూపంలో బ్యాంకులకు చేరుకుంటున్నాయి. కాగా వెనక్కి వచ్చిన 2వేల నోట్లలో అత్యధిక శాతం డిపాజిట్ల రూపంలో వచ్చినవే అని పేర్కొంది. 'బ్యాంకుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. మే 19 తర్వాత నుంచి జూన్ 30వ తేదీ వరకు రూ.2.72లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు మళ్లీ బ్యాంకులకు చేరుకున్నాయి. మొత్తం చలామణీలో ఉన్న నోట్లలో ఇది 76శాతం. ఇక, రూ. 84 వేల కోట్ల విలువైన నోట్లు మాత్రమే చలామణీలో ఉన్నాయి' అని ఆర్బీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే బ్యాంకులకు చేరుకున్న రూ.2వేల నోట్లలో దాదాపు 87 శాతం డిపాజిట్ల రూపంలోనే వచ్చినట్లు ఆర్బీఐ పేర్కొంది. మిగతా 13 శాతం నోట్లను ప్రజలు మార్చుకున్నట్లు పేర్కొంది. మార్కెట్‌లో చలామణిలో ఉన్న రూ.2వేల నోట్లను వెనక్కి తీసుకుంటున్నట్లు ఆర్బీఐ మే 19న ప్రకటించింది. వినియోగదారులకు రూ.2వేల నోట్లు ఇవ్వొద్దని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను మార్చుకునేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు విధించింది. 2016లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు తర్వాత రూ.2వేల నోట్లను కేంద్రం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత క్రమంగా వీటిని విపణిలో నుంచి తగ్గిస్తూ వచ్చింది. 2023 మార్చి 31 నాటికి కేవలం రూ.3.62 లక్షల కోట్లు మాత్రమే చాలామణిలో ఉన్నట్లు ఆర్బీఐ అంచనా వేసింది. ఇందులో 76శాతం నోట్లు తిరిగి బ్యాంకులకు చేరుకున్నాయని తాజా ప్రకటించింది.

సర్పంచ్‌లకు జగన్ క్షమాపణ చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పంచాయతీలకు నిధులు, విధులు లేకుండా నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఆందోళన చేపట్టిన సర్పంచ్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం గౌరవమున్నా 14, 15 ఆర్థికసంఘం నిధులను తక్షణమే పంచాయతీలకు అప్పగించి... సర్పంచ్‌లకు క్షమాపణ చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికశాతం పంచాయతీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంది. సర్పంచ్‌ల పరిస్థితి 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి'లా దయనీయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు విలువ లేకుండా పోవడం విచారకరం. పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రం కేటాయించిన 14, 15 ఆర్థికసంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం లాగేసుకోవడంతో సర్పంచ్‌లు ఆందోళనబాట పట్టారు. సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర శాఖలకు బదలాయించడం వల్ల పంచాయతీల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యాల మరమ్మతులు వంటి చిన్న పనులు సైతం చేయించలేని పరిస్థితిలో సర్పంచ్‌లు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రజలకు సేవ చేయడంలో జగన్ సర్కార్ కలిగిస్తున్న అడ్డంకులతో ఆందోళన చెందిన 20 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోవడం శోచనీయం. అయినప్పటికీ సీఎం జగన్‌కు చీమకుట్టినట్టయినా లేకపోవడం విచారకరం. జగన్‌కు రాజ్యాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సర్పంచ్‌లకు క్షమాపణ చెప్పాలి. తక్షణమే ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు జమ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

సిగ్నలింగ్ లోపాలే కారణం

ఒడిశాలో రైలు దుర్ఘటనపై విచారణ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ: ఒడిశాలోని బాలాసోర్ రైలు దుర్ఘటనకు తప్పుడు సిగ్నలింగే ప్రధాన కారణమని విచారణలో తేలింది. సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ (ఎస్&టీ) శాఖలో అనేక స్థాయిల్లో లోపాలు ఉన్నట్టు వెల్లడైంది. ఈమేరకు స్వతంత్ర దర్యాప్తు నివేదికను రైల్వే బోర్డుకు రైల్వే భద్రతా కమిషన్ (సీఆర్ఎస్) సమర్పించింది. సిగ్నలింగ్, సర్క్యూట్ మార్పులో లోపాలే ప్రమాదానికి కారణమని తేల్చింది. పదేపదే అసాధరణ రీతిలో స్విచ్‌లు పనిచేసినప్పుడు ఎస్&టీ సిబ్బంది పరిష్కార చర్యలను తీసుకోవాల్సిందని అభిప్రాయపడింది. బహనగ బజార్ స్టేషన్ వద్ద లెవల్ క్రాసింగ్ గేట్ 94 ఎలక్ట్రిక్ లిఫ్టింగ్ బారియర్ మార్పే పనుల కోసం సర్క్యూట్ డయాగ్రామ్ ఇవ్వకపోవడం తప్పుడు చర్యని, అది తప్పుడు వైరింగ్‌కు దారితీసిందని నివేదిక వెల్లడించింది. వైరింగ్ డయాగ్రామ్‌ను పర్యవేక్షకుల బృందం సవరించినప్పటికీ దానిని అనుసరించడంలో విఫలమైనట్లు పేర్కొంది. 2022, మే 16న ఇదే తరహా దుర్ఘటన ఖరగ్‌పూర్ డివిజన్‌లో చోటుచేసుకుందని నివేదిక తెలిపింది. అప్పుడే వైరింగ్‌ను సరిచేసివుంటే తాజా ఘటన జరిగేది కాదని వెల్లడించింది. జూన్ 2న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సహా మూడు రైళ్లు అనూహ్య రీతిలో ఢీకొన్న ఘటనలో 292మంది ప్రాణాలు కోల్పోగా 1000 మందికి పైగా గాయపడ్డారు.

ఎన్‌సీపీ మహారాష్ట్ర అధ్యక్షుడిగా తట్కరే

- శాసనసభాపక్ష నేతగా అజిత్ పవార్
- ప్రఫుల్ పటేల్ ప్రకటన



ముంబై: జయంత్ పాటిల్ స్థానంలో ఎన్‌సీపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడిగా లోక్‌సభ ఎంపీ సునీల్ తట్కరేను, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను శాసనసభాపక్ష నేతగా నియమిస్తున్నట్లు ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉద్వాసనకు గురైన ప్రఫుల్ పటేల్ సోమవారం సాయంత్రం ప్రకటించారు. అంతకుముందు, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్... తిరుగుబాటులో అజిత్ పవార్‌కు అండగా నిలిచిన ఇద్దరు ఎంపీలు పటేల్, తట్కరేను పార్టీ నుంచి తొలగించారు. గత నెలలో ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికయిన రాజ్యసభ ఎంపీ పటేల్, అజిత్ పవార్‌తో కలిసి ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తట్కరేకు బాధ్యతలు అప్పగించాలని పాటిల్‌కు తెలియజేసినట్లు చెప్పారు. ఎన్‌సీపీ శాసనసభా పక్ష నేతగా అజిత్ పవార్ ఉంటారని పటేల్ చెప్పారు. 'ఈరోజు గురు పూర్ణిమ. శరద్ పవార్ మమ్మల్ని ఆశీర్వదించాలని మేమందరం కోరుకుంటున్నాము' అని అన్నారు. 'గరిష్ఠ' ఎన్‌సీపీ శాసనసభ్యుల మద్దతు తనకు ఉందని, పార్టీ ఎమ్మెల్యేలు జయంత్ పాటిల్, జితేంద్ర అవద్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ ఇచ్చానని తెలిపారు. అజిత్ పవార్ మాట్లాడుతూ పార్టీ, ఎమ్మెల్యేలు తన వెంటే ఉన్నారని, తనతో పాటు కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన ఎనిమిది మంది మంత్రులపై అనర్హత వేటు వేసిన నోటీసు అర్థరహితమని అన్నారు. తన దగ్గర పార్టీ ఉందని, దాని గుర్తు (గడియారం) కూడా ఉందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. 'మేము ఏం చేసినా పార్టీ ప్రయోజనాల కోసమేనని.. పార్టీని మరింత బలోపేతం చేస్తాము' అని అన్నారు. ఎన్‌సీపీ జాతీయ అధినేత ఎవరని అడిగిన ప్రశ్నకు అజిత్ పవార్ ఎదురు దాడికి దిగారు. 'పార్టీ జాతీయ అధ్యక్షుడు శరద్ పవార్.. మరిచిపోయారా? అసెంబ్లీలో ప్రతిపక్ష నేతను స్పీకర్ నియమిస్తారని, పార్టీ కార్యకర్త కాదని ఆయన అన్నారు. పటేల్ ప్రకటించిన ఇతర నియామకాలలో రూపాలి చకన్కర్‌ను పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. అలాగే ఎమ్మెల్సీ అమోల్ మిత్కారీ, ఆనంద్ పరంజపే అధికార ప్రతినిధులుగా ఉంటారు. మహారాష్ట్రలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా సూరజ్ చవాన్ నియమితులయ్యారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ సరుకులకు

క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కింద ఇచ్చే టేక్ హోం రేషన్ సరుకులన్నీ అత్యంత నాణ్యంగా ఉండాలని, క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరి అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో చిక్కి, పావు కిలో డ్రై ఫ్రూట్స్, 3 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు ఇస్తున్నామన్నారు. అలాగే వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, అర కిలో బెల్లం, అరకిలో చిక్కి, అరకిలో డ్రై ఫ్రూట్స్, 3 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు అందజేస్తున్నామని తెలిపారు. పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన వారందరికీ అందేలా ఎస్‌ఓపీ పాటించాలని, దీనికి సంబంధించి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని అధికారులకు సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో దీన్ని అనుసంధానం చేయాలన్నారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, పౌష్టికాహారం, చక్కటి ఆరోగ్యపు అలవాట్లు తదితర వాటిపై ఈ కార్యక్రమం ద్వారా పర్యవేక్షణ చేయాలని, ఇందులో భాగంగా చికిత్సకు అవసరమైన వారిని రిఫరల్ చేసే కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు అంగన్‌వాడీల సూపర్‌వైజర్ కూడా ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించేందుకు స్టడీ మీటర్, ఇన్‌ఫాంటో మీటర్, సాల్టర్ స్కేల్, బరువును తూచే యంత్రాలన్నింటిని కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీల్లోని 3-6 ఏళ్ల వయస్సున్న పిల్లలకు 19 వస్తువులతో కిట్లు ఇస్తున్నామని, ఈనెలాఖరు కల్లా పంపిణీ పూర్తవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. బాల్య వివాహాల నిరోధంలో కళ్యాణమస్తు, షాదీ తోఫా, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కీలక పాత్ర పోషిస్తాయని, ఈ పథకాలు పొందాలంటే వధూవరులు తప్పనిసరిగా టెన్త్ చదవాలన్న నిబంధన కూడా పెట్టామని సీఎం తెలిపారు. ఒక్కసారి టెన్త్ చదివిన తర్వాత ఇంటర్మీడియట్‌కు అమ్మఒడి, ఆపై చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన అమలవుతున్నాయన్నారు. మండలానికి ఒక జూనియర్ కళాశాల అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని, టెన్త్ తర్వాత చదువులు ఆపేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉష శ్రీచరణ్, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, పాఠశాల విద్యాశాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత, ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ అండ్ వీసీ జి.వీరపాండ్యన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైసీపీలోకి ఆనం జయకుమార్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు జిల్లా టీడీపీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి సోమవారం వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేత కోటిరెడ్డి పాల్గొన్నారు.

సాహితీవేత్త మల్లెమాల మృతి

విశాలాంధ్ర-కడప: ప్రముఖ సాహితీవేత్త, కడపనగరంలో పేరొందిన పేదల వైద్యులు డాక్టర్ మల్లెమాల వేణుగోపాలరెడ్డి (88) సోమవారం ఉదయం స్వగృహంలో మరణించారు. ఆయన ఆరోగ్యం గత నెల రోజులుగా క్రమేణా క్షీణిస్తూ వచ్చింది. నెల్లూరు జిల్లా స్వస్థలమైన ప్పటికీ, ఆయన డాక్టర్ వరలక్ష్మిని వివాహం చేసుకున్నప్పటి నుంచి కడప నగరంలో స్థిరపడి పురప్రముఖులలో ఒకరయ్యారు. మల్లెమాల వేణుగోపాలరెడ్డి ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగినవారు. ప్రముఖ సినిమా నిర్మాత మల్లెమాల సుందరరామిరెడ్డి (ఎమ్మెస్‌రెడ్డి) ఆయనకు స్వయానా అన్న. కట్టమంచి రామలింగారెడ్డికి డా॥వరలక్ష్మి మేనకోడలు. కడపలో పేరున్న గైనకాలజిస్ట్. చాలా తక్కువ ఫీజుతో వైద్యం చేసేవారు. కడపలోని పేద ముస్లింలంతా వారి దగ్గరకే వచ్చేవారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ఆయన 1960లలోనే తన పెద్ద కుమార్తె శిరీష పేరుతో కథలు రాశారు. ఆ తరువాత తన పేరుతోనే ఇప్పటికి దాదాపు 100 కథలు(ఐదు సంపుటాలుగా వచ్చాయి) రాశారు. 'ఆవలి గట్టు' నవల రాశారు.

జిల్లారచయితల సంఘం అధ్యక్షుడిగా మల్లెమాల వున్న సమయంలో 1970లలో శ్రీశ్రీ, కొడవటిగంటి వంటి సాహితీ దిగ్గజాలను కడపకు రప్పించి, ప్రతి యేడు గొప్ప సాహిత్యసభలు నిర్వహించారు. 2009 నుంచి 'మల్లెమాల సాహిత్య పురస్కారం' పేరుతో పురస్కారాలు అందిస్తున్నారు. ఆయన పురస్కారాల సభలే కాదు, పుస్తకావిష్కరణలే కాదు, ఏ సభలు జరిపినా ఒక పెద్ద పెళ్లిలా చేశారు. సినిమా రంగంలో వుంటూ సాహిత్యకారులైన జగ్గయ్య, గొల్లపూడి మారుతీరావు, తణికెళ్ల భరణి, రంగనాథ్ వంటి వారిని ముఖ్య అతిథులుగా సభలకు రప్పించారు. రాజకీయాల్లో వుంటూ భాషాభిమానులైన మండలి బుద్ధప్రసాద్ వంటి వారిని కూడా పిలిచారు.

తపాలా శాఖ ప్రైవేటీకరణ వద్దు

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర-ఒంగోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తపాలా శాఖను ప్రైవేటీకరించే ఆలోచ నను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో డాక్ భవన్ వద్ద జరుగుతున్న ధర్నాకు మద్దతుగా సోమవారం ప్రకాశం జిల్లా ఒంగోలులోని కేంద్ర పోస్టాఫీస్ కార్యాలయం వద్ద పోస్టల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రవీంద్రనాథ్ మాట్లాడుతూ తపాలా శాఖను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం జోరుగా అడుగులు వేస్తోందని తెలిపారు. అందులో భాగంగా టార్గెట్‌లు పెట్టి అధికారులు ఎక్కువ ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రూప్ సి యూనియన్ గుర్తింపును ప్రభుత్వం రద్దు చేసి తపాలా శాఖను నిర్వీర్యం చేసేందుకు అడుగులు ముందుకు వేస్తోందని విమర్శించారు. ఈపాటికే వీటిపై కోర్టుకు వెళ్లటం జరిగిందన్నారు. ఖాళీగా ఉన్న సార్టింగ్ పోస్ట్‌మెన్, పోస్ట్‌మెన్, ఎంటీఎస్, జీడీఎస్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న మెయిల్ రివర్సీ టీఏ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, ఎంటీఎస్ నుంచి పోస్ట్‌మెన్‌కు సీనియారిటీ కోటాను భర్తీ చేయటానికి డీపీసీ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని, 1983 నుంచి పోస్ట్‌మెన్, ఎంటీఎస్‌లు పీఏ, ఎస్ఏ పరీక్ష పాసైన వారికి ఇచ్చిన ఇండక్షన్ ట్రైనింగ్‌ను రెగ్యులర్ సర్వీసుగా పరిగణించాలని, సెలవు దినాలలో పని చేసే పోస్ట్‌మెన్, ఎంటీఎస్‌లకు ఫిక్స్‌డ్ మానటరీ కాంపెన్సేషన్ అలవెన్స్ రేటును పెంచాలని, డ్రెస్ అలవెన్స్ రూ.5 వేల నుంచి 15 వేలకు పెంచాలని, సర్వీసు మూడు సంవత్సరాలు పూర్తయినా ఎలాంటి నిబంధనలకు తావు లేకుండా ఎల్‌జిఓ పరీక్షకు అనుమతించాలని, ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రేడ్ సి యూనియన్ గుర్తింపు రద్దును ఉపసంహరించుకోవాలని డిమాం డ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పి.వి.ఆర్.చౌదరి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తంగా స్నేహపూర్వక వెబ్‌సైట్

ఆవిష్కరించినచదలవాడ నాగరాణి

విశాలాంధ్ర- విజయవాడ : విద్యార్థులకు అన్ని విధాలా సహాయ కారిగా ఉండేలా సాంకేతిక విద్యా శాఖ నూతన వెబ్ సైట్‌ను రూపొందిం చిందని ఆ శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్క్రీన్ రీడర్‌లను ఉపయోగిం చడం ద్వారా దృష్టిలోపం ఉన్న వ్యక్తులు సైతం చదవగలిగేలా ఈ నూతన వెబ్‌సైట్ కంటెంట్‌ను అందిస్తుందన్నారు. సోమవారం మంగళగిరిలోని సాంకేతిక విద్యా శాఖ కార్యాలయంలో స్నేహపూర్వక వెబ్ సైట్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ నూతన వెబ్ సైట్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాలిటెక్నిక్‌ల గురించిన మొత్తం సమాచారాన్ని సందర్శకులు, విద్యార్థులు పొందగలుగుతారన్నారు. ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను సైతం ఈ వెబ్‌సైట్ కలిగి ఉందని, సాధారణ పౌరుల మొదలు, విద్యార్థులు, సందర్శకులు వారి ఆలోచనలు, సూచనలు, ఫిర్యాదులు మొదలైనవాటిని ఇక్కడ నేరుగా పొందుపరచగలుగుతారన్నారు. వీటిని రానున్న కాలంలో వెబ్ సైట్ అప్‌గ్రేడేషన్‌కు విలువైన ఇన్‌పుట్‌లుగా తీసుకుంటామన్నారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, పాలిసెట్, ఇంజనీరింగ్ అడ్మిషన్‌లు, విద్యార్థుల బదిలీలు వంటి ఉపయోగకరమైన వెబ్‌సైట్ లింక్‌లు కూడా దీనిలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.ఎ.రామకృష్ణ, డాక్టర్ బి.కళ్యాణ్, రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణా మండలి కార్యదర్శి కె.వి.రమణబాబు, సంయుక్త కార్యదర్శులు జానకి రామయ్య, సత్యనారాయణ, ఐటీ సమన్వయకర్త డాక్టర్ కె.రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో మూడేళ్ల కోర్సును కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు

విశాలాంధ్ర-విజయవాడ: నాలుగేళ్ల డిగ్రీ వద్దు... మూడేళ్ల డిగ్రీని కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలో అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో, అలాగే అనంతపురం నగరంలో ఉన్న ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ సీబీజెడ్ గ్రూప్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చుట్టుపక్కల పది మండలాల నుంచి విద్యార్థులు వస్తారని, అలాగే అనంతపురం నగరంలో ఉన్న ఆర్ట్స్ కళాశాలకు కూడా చుట్టుపక్కల మండలాల విద్యార్థులు చదువుకోవడానికి వస్తారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్యను ప్రవేశపెట్టిన నేపథ్యంలో అక్కడ కేవలం బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ) గ్రూప్‌లు మాత్రమే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బైపీసీ చదువుకున్న విద్యార్థులు కళాశాలలో చేరడానికి అక్కడ బీఎస్సీ సీబీజెడ్‌కి సంబంధించిన గ్రూప్ లేదన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని, తక్షణమే బీఎస్సీ సీబీజెడ్ గ్రూప్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

74 డీవైఈఓ పోస్టులకు ఆమోదముద్ర!

ఏపీపీఎస్సీకి బాధ్యతలు
పదోన్నతులతో 50 శాతం భర్తీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చాలా ఏళ్ల తర్వాత డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈఓ) పోస్టులు భర్తీ కానున్నాయి. దాదాపు 74 డీవైఈవో పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినట్లు తెలిసింది. విద్యారంగాభివృద్ధికి సీఎం జగన్ చేపడుతున్న కృషిలో భాగంగా, విద్యను మరింత గాడిలో పెట్టి, ఎంఈవోలు, హెచ్‌ఎంలపై పర్యవేక్షణకు డీవైఈవో పోస్టులను భర్తీ చేయనున్నారు. విద్యా రంగాభివృద్ధికి సీఎం జగన్ అనేక కార్యక్రమాల్ని చేపడుతున్నప్పటికీ, సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నప్పటికీ పరిపాలనా వ్యవస్థలో లోపాలున్నాయి. వాటిని అధిగమించేందుకు డీవైఈవోల భర్తీకి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రకటన ఎప్పుడిస్తారనేదీ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. విద్యాశాఖలో నేరుగా ఈ తరహా పోస్టులు రావడం అరుదైన విషయం. రాష్ట్రంలోని 74 డివిజన్లకు డివిజన్‌కు ఒక డీఈవో చొప్పున డీవైఈవో పోస్టులను భర్తీ చేస్తారు. ఇందులో 37 పోస్టులను (50 శాతం) ప్రస్తుతం పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులపై కేటాయిస్తారు. మిగిలిన 37 పోస్టులను నేరుగా ఏపీపీఎస్సీ ద్వారా భర్తీకి ప్రభుత్వం అప్పగించింది. జిల్లాల్లో ఎక్కడ ఖాళీ లుంటే అక్కడ పదోన్నతులతోను, నేరుగాను ఈ పోస్టులను భర్తీచేస్తారు. పాఠశాల విద్యలో డీఈవోల తర్వాత డీవైఈవోలదే కీలక పాత్రగా ఉంటుంది. ప్రతి జిల్లాల్లో డివిజన్ల వారీగా డీవైఈవోలు కార్యకలాల్ని కొనసాగిస్తుంటారు. ఎంతో కాలం నుంచి పదోన్నతుల కోసం హెచ్‌ఎంలు ఎదురు చూస్తున్నారు. అలాంటి వారికి సీనియార్టీ, రిజర్వేషన్ల ఆధారంగా డీవైఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా కేటాయించనుంది. ఈ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటన రావడమే ఆలస్యం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎంఈవో 2 పోస్టులను భర్తీ చేసింది. మండలా నికి ఎంఈవో 1, ఎంఈవో 2గా పని విభజించి వారితో సేవలను ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇటీవల ప్రభుత్వం పాఠశాలల్లో హెచ్‌ఎంలకు సైతం పదోన్నతులు కల్పించారు. వరుస వారీగా ఈ ప్రక్రియ పూర్తవ్వడంతో, ఇక డీవైఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. డీవైఈ వోల పోస్టుల భర్తీకి అర్హతలు విధి విధా నాలను ఏపీపీఎస్సీ ప్రకటనలో పొందుపర్చుతారు.

పోరాటాలతోనే హక్కుల రక్షణ

భవననిర్మాణ కార్మికుల సమావేశంలో హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: భవన నిర్మాణ కార్మికులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీరని ద్రోహం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి విమర్శిం చారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను దారి మళ్లిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బైరాగిపట్టెడలో గల ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. హరినాథరెడ్డి మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఇప్పటి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం, గత టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకున్నాయని విమర్శించారు. దీనిపై పెద్దఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని, అందుకోసం గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశాలు జరపాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ కరోనా కాలం నుండి భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతన ఇసుక విధానం వల్ల ధరలు విపరీతంగా పెరిగాయని, దీంతో ఉపాధి రంగం తీవ్రంగా దెబ్బతిందని, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర అవస్థలు పడ్డారని చెప్పారు. భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శెట్టిపల్లి రవి, హరిబాబు, ప్రకాశ్, అన్నయ్య, చంద్రబాబు, సీహెచ్ రమణ, సుబ్బారావు, వెంకటేశ్, భాస్కర్, చిరంజీవి పాల్గొన్నారు

విజయవాడ-చెన్నై వందేభారత్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో మరో వందేభారత్ రైలు అందుబాటులోకి రానుంది. విజయవాడ-చెన్నై మధ్య రాకపోకలు సాగించే ఈ రైలును ప్రదాని మోదీ ఈ నెల 7న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు విజయవాడ డివిజన్ రైల్వే అధికారులకు సమాచారం అందింది. ఇప్పటికే సంబంధిత అధికారులు ప్రారంభోత్సవ ఏర్పట్లలో ఉన్నారు. ఈ రైలు 8 నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ఉంటాయని చెపుతున్నారు.విజయవాడ నుంచి చెన్నై మధ్య ఏయే స్టేషన్లలో ఆగుతుంది, రాకపోకల సమయాలు, టిక్కెటు ధరలు త్వరలో ప్రకటించనున్నారు. విజయవాడ-చెన్నై మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ రైలును రేణిగుంట మీదుగా నడపాలని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు కోరినట్లు తెలిసింది.

ఆదుకుంటున్న బొప్పాయి పాలు

కేజీ రూ.60 నుంచి రూ.200

విశాలాంధ్ర-చాగలమర్రి: బొప్పాయి పంటకు వైరస్ ఎక్కువ. సీజనల్ ఇబ్బందులు వల్ల పంట దిగుబడిలో అంచనాలు తారుమారవుతాయి. ఒక్కోసారి బొప్పాయి కాయల డిమాండ్ స్థిరంగా ఉండదు. అయితే బొప్పాయి పాలకు పెరుగుతున్న ప్రాధాన్యత వల్ల రైతులు ఈ అనిశ్చితి నుంచి బయటపడుతున్నారు. బొప్పాయి పండ్లు అనేక రకాల వ్యాధులకు ఔషధంగా పని చేస్తాయని వైద్యులు చెబుతారు. డెంగ్యూ, కోవిడ్ వ్యాధుల బారిన పడిన వారు కూడా బొప్పాయి పండు విరివిగా తినాలని సూచిస్తున్నారు. బొప్పాయి ఆకు రసం సేవించవచ్చని కొందరు వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం బొప్పాయికి వైరస్ సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో అనుకున్నంత గిరాకి లేకపోవడంతో ఎగుమతులు తగ్గాయి. దీంతో టన్ను ధర రూ.32 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయింది. ఈ పరిస్థితుల్లో బొప్పాయి పాల సేకరణ రైతులను ఆదుకుంటోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో బొప్పాయి సాగు చేసి నష్టపోయిన రైతులకు బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.

బొప్పాయి పాల సేకరణకు మహారాష్ట్ర, తమిళనాడులోని కోయంబత్తూరు, కడప జిల్లాలోని రైల్వేకోడూరుకు చెందిన వ్యాపారులు చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించి వైరస్ సోకి పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి పంటను ఎకరాకు రూ.10వేలు, పాక్షికంగా దెబ్బ తిన్న పంటకు రూ.15 వేలు చెల్లించి పాలను సేకరిస్తున్నారు. కేజీ పాలను రూ.60 నుంచి రూ.200 వరకు కొంటున్నారు. ఈ పాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నట్లు వారు చెబుతున్నారు. బొప్పాయి పండ్లు ఎగుమతి చేసే ఏజెంట్ వెంకటేశ్ మాట్లాడుతూ ఢిల్లీలో బొప్పాయి పళ్లకు అధిక డిమాండ్ ఉంటుందన్నారు. బొప్పాయి పాలకు గిరాకీ ఉండటంతో ఆ తోటలు కొనుగోలు చేసి పాలను సేకరిస్తున్నామని చెప్పారు. 10 మంది కూలీలు రోజుకు 50 నుంచి 15 కేజీల బొప్పాయి పాలు సేకరిస్తారు. పాలు సేకరించే కూలీలకు రోజు రూ.600 నుంచి రూ.800 వరకు డబ్బులు ఇస్తున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఎకరా బొప్పాయి పంట నుంచి 75 కేజీల పాలు, పూర్తిగా దెబ్బతిన్న పంట నుంచి 50 కేజీల పాలు వస్తాయి.

బొప్పాయి పాలు సేకరిస్తున్నాం

ప్రతి రోజూ ఒక ఎకరా పంటలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 కేజీల పాలు సేకరిస్తాం. కేజీ పాలకు రూ.25 కూలీ ఇస్తున్నారు. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.

\- లక్ష్మీదేవి, కూలీ, రైల్వే కోడూరు

బొప్పాయి పాలతో ఊరట

ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాల వల్ల బొప్పాయి పంటకు నష్టం వాటిల్లుతోంది. గిట్టుబాటు ధర లేక ఇబ్బందిపడుతున్నాం. ఈ పంట సాగుకు అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాలి. అయితే బొప్పాయి పాల సేకరణతో కొంత ఊరట కలుగుతోంది.

\- గురునాథ్ రెడ్డి, రైతు, చిన్నవంగలి

పాలు ఎలా తీస్తారంటే...బొప్పాయి కాయలకు బ్లేడుతో గాట్లు వేస్తారు. పాలు కారే సమయంలో చెట్టు కింద ప్లాస్టిక్ ప్లేటు ఏర్పాటు చేస్తారు. ఇలా సేకరించిన పాలు ముద్దగా మారిపోతాయి. వాటిపై నీళ్లు చల్లి ప్లేట్లలో ఉన్న పాలను డ్రమ్ములోకి మార్చి ఎగుమతి చేస్తారు. పాలు కారాక బొప్పాయి కాయలు పనికి రాకుండా పోతాయి. రైతులు బొప్పాయి చెట్లను తొలగిస్తారు. దెబ్బతిన్న బొప్పాయి తోటల్లో పాల సేకరణతో రైతులకు ఉపశమనం కలుగుతోంది.

ప్రధానికి పోలవరం సమస్యలు వివరించండి

సీఎం జగన్‌కు శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకురావాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం లేఖ రాశారు. ఈనెల 5వ తేదీన ప్రధానమంత్రిని జగన్ కలుస్తున్నందున ఆయన ఈ లేఖ రాశారు. 'పోలవరం నిర్వాసితులు, గిరిజనులు సుమారు 500 మందితో కలిసి 14 రోజులుగా పాదయాత్ర చేస్తున్నాను. ఆయా సమస్యల్ని ఎప్పటికప్పుడు మీ దృష్టికి ఇప్పటికే నిర్దిష్టంగా ఉత్తరాల ద్వారా తెలియజేశాను. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత మండలాలు-దేవీపట్నం, చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడులో పాదయాత్ర చేశాను. నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ప్యాకేజీలు ఏవీ అమలు కాలేదు. కేవలం 10 నుంచి 15 శాతం మందికి మాత్రమే అరకొరగా అందజేశారు. 41.5 మీటర్ల వద్ద 20 గ్రామాలు...20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారు. కానీ మొన్నటి వరదల్లో 40 మీటర్లకు 193 గ్రామాలు మునిగాయి. కాంటూరు లెక్కలన్నీ తప్పుల తడకే. 1986, 2022 వరదల ఆధారంగా రీసర్వే జరగాలి. గతేడాది వరద వచ్చినప్పుడు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇంకా పూర్తిగా అందలేదు. ఈ ఏడాది వరద వచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టును ఆనుకుని ఉన్న ప్రాంతాల నుండి బలవంతంగా నిర్వాసితులను తరలించారు. ఆ నిర్వాసితుల కాలనీల్లో ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడం లేదు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. వీటికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టడానికి ఒత్తిడి తెచ్చి సాధిస్తారని ఆశిస్తున్నాను. నిర్వాసిత ప్రజలకు మీరిచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరుతున్నాను. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ఈ విషయాలపై మీరు ప్రధానమంత్రితో చర్చించి నిర్దిష్ట హామీ తీసుకోవాలి' అని శ్రీనివాసరావు కోరారు.

కేసీఆర్ పతనం ఖాయం: భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పతనం కాబోతోందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు మల్లు భట్టి విక్రమార్క జోస్యం చెప్పారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కారు చౌకగా విక్రయిస్తోందని, దీనివల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దేశ ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. తాను చేసిన పాద యాత్ర 308 రోజులు దిగ్విజయంగా సాగిందని, ప్రజల సమస్యల్ని తెలుసుకున్నానని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ బాబు, జగన్, పవన్ అంటే బీజేపీకి నిర్వచనమని ఎద్దేవా చేశారు. దేశంలో బీజేపీపై ప్రజలు వ్యతిరేకత చూపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపడుతుందని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని చెప్పారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, ఏఐసీసీ సభ్యులు మేడ సురేష్, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రక్ష రామయ్య, మమతా నాగిరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు పాల్గొన్నారు. తొలుత భట్టి విక్రమార్కను శాలువాతో గిడుగు రుద్రరాజు సన్మానించారు.

సంపాదకీయం

బీజేపీ బందిపోటు రాజకీయాలు

రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేయడానికి మోదీ, అమిత్ షా నాయకత్వంలోని బీజేపీకి ఓట్లు, సీట్లతో సంబంధం లేదు. తగినన్ని సీట్లు లేకపోయినా ఇతర పార్టీలవారిని ప్రలోభ పెట్టగలదు, బెదిరించగలదు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీబీఐ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్, ఆదాయపు పన్ను శాఖ ద్వారా భయకంపితంచేసి లొంగ దీసుకోగలదు. ఏదీ కుదరకపోతే ఇతర పార్టీలను నిలువునా చీల్చగలదు. ఆదివారం మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.) నాయకుడు అజిత్‌పవార్ పార్టీ అధినేత శరద్ పవార్‌పై తిరుగుబాటు చేయడం బీజేపీ అనుసరిస్తున్న ఈ బందిపోటు విధానాలలో భాగమే. శరద్ పవార్ సోదరుడి కుమారుడైన అజిత్ పవార్ ఎప్పటి నుంచో అధికార పీఠంపై అధిష్ఠించాలని తాపత్రయ పడ్తున్నారు. ఇటీవల కూడా ఆయన ఆ ప్రయత్నం చేశారు. అప్పుడే శరద్ పవార్ ఎన్.సి.పి. స్వర్ణోత్సవాలకన్నా కొంచెం ముందు తాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నాని ప్రకటించి అందరినీ ఆశ్చర్య పరిచారు. తరవాత "పార్టీ శ్రేణుల" ఒత్తిడి కారణంగా రాజీనామా ప్రతిపాదన ఉపసం హరించుకున్నారు. సుప్రియా సూలేను కార్య నిర్వాహక అధ్యక్షురాలిని చేశారు. తన సోదరుడి కుమారుడైన అజిత్ పవార్‌ను ప్రతిపక్ష నాయకుడిగా ఉంచేశారు. ఇదంతా శరద్ పవార్ రాజకీయ దురంధతకు నిదర్శనం అనుకున్నారు. కానీ బీజేపీ కుటిల పన్నాగాల ముందు పవార్ రాజకీయ దురంధత ఘోరంగా వీగి పోయింది. ఆదివారం ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన వర్గం, బీజేపీతో కూడిన మంత్రివర్గంలో అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి అయితే, మరో ఎనిమిది మందికి మంత్రి పదవులు దక్కాయి. అజిత్ పవార్ సహా వీరందరికీ ఓ ఉమ్మడి లక్షణం ఉంది. అదేమిటంటే వీరంతా ఇంతకు ముందు కేంద్ర దర్యాప్తు సంస్థల వేధింపులకు గురైన వారే. మహారాష్ట్ర సహకార బ్యాంకుల కుంభకోణంలో అజిత్ పవార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ దర్యాప్తు సాగుతోంది. ఛగన్ భుజబల్ అయితే ఎన్‌ఫోర్స్‌మెంటు దర్యాప్తులో ఆరోపణలు ఎదుర్కొంటూ ఏడాదికిపైగా జైలులో గడిపి వచ్చారు. హసన్ ముష్రిఫ్ మీద ఆదాయపు పన్నుశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అనేకసార్లు దాడులు చేసింది. సునీల్ తట్కరే మీద అవినీతి, డబ్బు అక్రమ చెలామణి కేసులున్నాయి. ఆయన పార్లమెంటు సభ్యులు. ఆయనే కుమార్తె అదితి తట్కరే ఆదివారం షిండే మంత్రివర్గంలో చేరిపోయారు. షిండే మంత్రివర్గంలో ఉన్న మొదటి మహిళ ఆమే. ముందు నుంచీ శరద్ పవార్‌కు కుడి బుజంలా ఉన్న ప్రఫుల్ పటేల్ కూడా అజిత్ పవార్‌తో పాటు తిరుగుబాటు చేశారు కానీ ఆయన మంత్రివర్గంలో చేరలేదు. ఆయన దేశ రాజకీయాల్లో కీలక భూమిక నిర్వహిస్తా రంటున్నారు. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించే సూచనలున్నాయి కనక ఆయనకు కేంద్రమంత్రి పదవి దక్కొచ్చు. ఏమైతే నేమి 1999లో శరద్ పవార్ ఏర్పాటుచేసిన ఎన్.సి.పి. నిట్ట నిలువునా చీలిపోయింది. 40 మంది అజిత్ పవార్‌తో పాటు తిరుగుబాటు చేసినందువల్ల ఇప్పుడు శరద్ పవార్‌తో నిలబడిన ఎమ్మెల్యేల సంఖ్య దాదాపు పదమూడు ఉంటుందేమో. మోదీ ప్రచారం చేస్తున్న డబుల్ ఇంజిన్ సర్కార్‌కు పరిమితం కాకుండా మహారాష్ట్రలో మూడు ఇంజన్ల ప్రభుత్వానికి తెర తీసినట్టయింది. ఎన్.సి.పి. కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సిఫార్సు మేరకు శరద్ పవార్ సునీల్ తట్కరేను, ప్రఫుల్ పటేల్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు.

శరద్ పవార్ బీజేపీ కంటికి అత్యంత ప్రమాదకారిగా కనిపిస్తున్నారు. ఆయన రాజకీయ చాతుర్యం, పలుకుబడి, ప్రతిపక్షాల ఐక్యతకోసం ఆయన నిరంతరం చేస్తున్న ప్రయత్నాలు బీజేపీ గుండెలో దడపుట్టించాయి. అందుకే పవార్ కోటకు బీజేపీ పెద్ద గండే కొట్టగలిగింది. బీజేపీ అనుసరిస్తున్న ఈ వ్యూహం మహారాష్ట్రకు సంబంధించినంత వరకు 13 నెలల కాలంలో రెండోసారి. మొదట గత ఏడాది శివసేనను నిట్ట నిలువునా చీల్చింది. దీనికి ఏక్‌నాథ్ షిండే సహాయ పడ్డారు. ఇప్పుడు అజిత్ పవార్ చీలికకు ప్రధాన సూత్రధారి అయ్యారు. ప్రాంతీయ పార్టీలను బతకనివ్వ కూడదన్నది బీజేపీ పథకం. అందుకే ఈ పార్టీలను చీల్చేస్తోంది. నిజానికి బాల్ థాక్రే ఏర్పాటు చేసిన శివసేన బీజేపీని మించిన హిందుత్వ వాది. శివసేన బలపడడం బీజేపీకి సుతరామూ గిట్టలేదు. ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వాన్ని కూల్చేసింది. ఇప్పుడు ఎన్.సి.పి.ని చీల్చింది. విచిత్రం ఏమిటంటే షిండేతో కలిసి శివసేనను వదిలి వెళ్లిపోయిన దాదాపు 40 మందిలో మంత్రి పదవులు దక్కనివారు ఆ అవకాశం కోసం ఎదురుచూస్తుండగా ఆదివారం ఎన్.సి.పి.పై తిరుగుబాటు చేసిన తొమ్మిదిమంది మంత్రులుగా ప్రమాణం స్వీకరిస్తుంటే గుడ్లప్పగించి చూడడం తప్ప ఏమీ మిగలలేదు. ప్రభుత్వాలను పడగొట్టడానికి, పార్టీలను చీల్చడానికి బీజేపీ కనీసం మూడు పద్ధతులు అనుసరిస్తుంది. ఇందులో సులభమైంది ప్రలోభాలకు గురిచేసి డబ్బు సంచులు అందజేయడం. అది కుదరకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయిస్తుంది. వారి ఆస్తులను జప్తు చేయిస్తుంది. అదీ కాకపోతే వారి పార్టీనే చీల్చేస్తుంది. అందుకోసం బందిపోటులా వ్యవహరించడానికి వెనుకాడదు. పార్టీలనే మింగేయడం బీజేపీకి అలవాటైన విధానం. శరద్ పవార్ లాంటి రాజకీయ దురంధరుడిని బీజేపీ కంగు తినిపించ గలిగిందంటే ఆయన అంత బలహీన పడిపోయారా? అధికార దాహంతో తల్లడిల్లిపోతున్న తన పార్టీ వారిని కట్టడిచేయడంలో విఫలమైనట్టు కనిపిస్తోంది. తనకు చీలికలు కొత్తకాదని, పార్టీని మళ్లీ బలోపేతం చేస్తానని పవార్ అంటున్నారు. అయితే తిరుగుబాటు నాయకుడు తాము పార్టీని చీల్చలేదని, ఎన్.సి.పి.నే ప్రభుత్వంలో చేరిందని ధీమాగా చెప్తున్నారు. ఎక్కువ మంది శాసనసభ్యులు తనతో ఉండడంవల్ల ఆయన ఆ మాట ధైర్యంగా చెప్తున్నారు. ఏది అసలైన పార్టీనో ఎన్నికల కమిషన్ తేల్చాలి. అది ఎప్పుడు జరుగుతుందో చెప్పలేం. తన స్వయం ప్రతిపత్తిని మోదీకి తాకట్టు పెట్టిన ఎన్నికల కమిషన్ ఏది అసలైన ఎన్.సి.పి. అని తేల్చడానికి పార్లమెంటు ఎన్నికలు పూర్తి అయ్యే దాకా సాగదీసినా చేయగలిగింది ఏమీలేదు. ఎన్.సి.పి. కి ప్రమాదం ముంచుకొస్తుందని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. మహారాష్ట్ర గడ్డ మీంచే ఎన్.సి.పి.కి గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందని, ఎన్.సి.పి. నాయకులు భయంకరమైన అవినీతి పరులని చెప్పడానికి వారు చేసిన కుంభకోణాల విలువ రూ.70,000 కోట్లు అని ఆరోపించారు. ఎన్.సి.పి.లో అవినీతిపరులైన వారు జైలులో పిండి రుబ్బాల్సి వస్తుందని ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. వారికి పిండి రుబ్బే పరిస్థితి నుంచి తప్పించడానికి కనికరించి బీజేపీ వారిని మూకుమ్మడిగా బీజేపీలో చేర్చేసుకుంది. ఆ వాషింగ్ మెషిన్‌లో వారు కడిగిన ముత్యాలైపోయారు. బీజేపీలో చేరిన వారు అంతకు ముందు ఎన్ని ఆరోపణలు ఎదుర్కున్నా "గంగా స్నానం" చేస్తారు కనక పునీతులై పోతారు. అవినీతితో రాజీ పడడానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ ఉండదు. అయితే ఆ పని చేయడానికి బీజేపీ బందిపోటులా వ్యవహరించడం భవిష్యత్తులో మోగనున్న ప్రమాద ఘంటికలకు సంకేతం.

భారమైన కార్మికుల జీవనం

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

కార్మికుల పని పరిస్థితులు ఏ మాత్రం మెరుగుపడలేదు. ఫలితంగా కార్మికుల జీవనం భారమైంది. జూలై 1, 2023న సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి(సీఎమ్ఐఈ) గణాంకాల ఆధారంగా, దేశంలో నిరుద్యోగిత 8.4 శాతానికి పెరిగింది, 30 రోజుల సగటు ఆధారంగా తీసుకున్న లెక్కల ప్రకారం నిరుద్యోగంతోపాటు ప్రజల జీవనోపాధి దిగజారింది. మార్కెట్లో ఉద్యోగాల లభ్యత అతి తక్కుగా ఉంది. ఉద్యోగుల్లో ఎక్కువ భాగం నూతన ఉద్యోగాల కోసం వెతకడం కూడా మానేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ 'ఉపాధి మేళాలు' నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి లేఖలు పంపడం వంటి వ్యూహ రచనలు చేస్తున్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, 2013-14లో, భారతదేశంలో నిరుద్యోగ రేటు కేవలం 4.9 శాతం కాగా, ఎన్ఎస్ఎస్ఓ డేటా ప్రకారం 2017-18లో 6.1 శాతం ఉంది. తాజా గణాంకాల ప్రకారం జూలై 1, 2023 నాటికి నిరుద్యోగిత 8.4 శాతానికి చేరింది.

2013-14 సంవత్సరంలో దేశంలో ఉపాధి, నిరుద్యోగంపై కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ నాల్గవ వార్షిక నివేదిక ప్రకారం, 2012-13 ఆర్థిక సంవత్సరంలో కార్మికులు పాల్గొనే రేటు (ఎల్‌పీఆర్) 52.5 శాతంగా అంచనా వేసింది. ఈ కాలంలో శ్రామిక జనాభా నిష్పత్తి 49.9 శాతం ఉంది. నవంబర్ 8, 2016న ప్రధాని మోదీ పెద్దనోట్ల రద్దు ప్రకటించిన సంవత్సరం 2016-17 నుండి దేశంలో ఎల్‌పీఆర్ వేగంగా క్షీణిస్తోంది. ఆ సంవత్సరంలో పెద్ద సంఖ్యలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు మూసివేత కారణంగా ఎల్‌పీఆర్ 46.2 శాతానికి దిగ జారింది. దేశంలో నగదు ప్రవాహంపై ఎక్కువగా ఆధారపడిన వివిధ పరిశ్రమలు మూతపడ్డాయి. దీనితోపాటు జులై 1, 2017న జిఎస్‌టిని అమలుతో ఉపాధి, జీవనరంగాలపై ప్రతికూల ప్రభావంపడింది.

సీఎమ్ఐఈ తాజా గణాంకాల ప్రకారం, శ్రామిక శక్తి 2021-22లో 40.1 శాతం క్షీణించింది. 2022-23లో ఇది మరింత తగ్గి 39.5 శాతానికి చేరింది. ఇది ప్రపంచంలోనే అత్యల్ప స్థాయి. అంతర్జాతీయంగా శ్రామిక శక్తి సగటు 60శాతం కాగా, ఇండోనేషియాలో ఎల్‌పిఆర్ 67శాతం, దక్షిణ కొరియా, బ్రెజిల్ దేశాల్లో 63-64 శాతం ఉందని ఈ విశ్లేషణ పేర్కొంది. 2019-20 సంవత్సరంలో కరోనా మహమ్మారి కాలంలో 442 మిలియన్లు ఉన్న శ్రామిక శక్తి, 2020-21లో 424 మిలియన్లకు తగ్గడంతో దేశీయ శ్రామికశక్తిలో గణనీయమైన క్షీణత

నమోదైంది. 2022-23లో శ్రామిక రంగం 439 మిలియన్లకు చేరింది. అయితే ఇది మహమ్మారికి ముందు ఉన్న స్థాయి కంటే తక్కువని చెప్పవచ్చు 2016-17లో 15 శాతం ఉన్న మహిళా కార్మికుల వాటా 2022-23లో 8.8 శాతానికి పడిపోయింది. సీఎమ్ఐఈ విశ్లేషణ ప్రకారం, మన దేశంలో పనిచేసే వయస్సులో ఉన్న 90 శాతం మంది మహిళలు శ్రామిక రంగానికి దూరంగా ఉన్నారని పేర్కొంది.

2014 నుండి గత తొమ్మిదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో భారీ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించిందని కేంద్ర ఉపాధి కల్పన శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తాజాగా ప్రకటించారు. వాస్తవానికి, గత 9 సంవత్సరాలలో కేవలం 1.25 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టించింది. ఇది ప్రతి సంవత్సరం అవసరమయ్యే 2 కోట్ల ఉద్యోగాలకు చాలా తక్కువనే చెప్పవచ్చు. దేశంలోని జాబ్ మార్కెట్‌లో ప్రతి సంవత్సరం ఎక్కువమంది యువత ప్రవేశిస్తున్నారు.

2014 లోకసభ ఎన్నికల ప్రచార సమయంలో "అందరికీ గౌరవప్రదమైన పని" ఇస్తామని వాగ్దానం చేసిన ప్రధాని మోదీ దేశ ప్రధాని అయిన తర్వాత మాట తప్పారు. అసంఘటిత రంగంగో తక్కువ-నాణ్యత గల ఉద్యోగాలు 90 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి. అయితే పని చేసే వయస్సులో ఉన్న జనాభాలో ఎక్కువ మందికి పని లేదు. ప్రస్తుతం 60.5 శాతం మంది కార్మికులకు సరైన పనిలేదు. పనిలేని పురుషుల శ్రామిక జనాభా దాదాపు 31శాతం కాగా, పనిలేని మహిళా శ్రామిక జనాభా 90 శాతం. అసంఘటితర రంగంలో ఉన్న కార్మికులకు సామాజిక భద్రత కవరేజీ లేదు.

2015లో కార్మిక విధానాలపై దేశంలోని అత్యున్నత త్రైపాక్షిక సంస్థ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ జాతీయ ఉపాధి విధానం(ఎన్ఇపి) రూపొం దించడానికి సిఫారసు చేసింది. మోదీ ప్రభుత్వం దీనిని అంగీకరించింది. అయితే దీని నుండి వెనక్కి తగ్గింది. భారత పార్లమెంట్‌లో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ అందించిన సమాచారం ప్రకారం, ఉపాధి కల్పనపై కేంద్రం జాతీయ ఉపాధిపథకం(ఎన్ఈపీ) ఎటువంటి ప్రణాళిక లేదని పేర్కొంది.

అభివృద్ధి విధానాలకు అనుగుణంగా తగిన ప్రణాళిలకను మానవ కేంద్రంగా రూపొందించాలని అంతర్జాతీయ కార్మిక సమాఖ్య, ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను కోరుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లోఅశాంతిని నివారించడానికి, ఇబ్బందులను అధిగమించ డానికి ఇటువంటి విధానాలను అవలంబించడం అవసరమని ఐఎల్ఓ, యుఎన్ హెచ్చరించాయి.. అయితే, భారతదేశంలోని 20 అగ్రశ్రేణి కంపెనీల లాభాల్లో 70 శాతం లాభాలు కైవసం చేసుకుంటున్నాయి. పెట్టుబడీదారీ విధానాలకు అనుగుణంగా లాభాపేక్షతో కూడిన అభివృద్ధి విధానాలకు అనుకూలంగా ఉన్న ప్రతిపాదనలను, సలహాలను ప్రధాని మోదీ విస్మరిస్తున్నారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ట్యాగ్‌తో అంచనా వేయ బడింది, ప్రధాని మోదీ హయాంలో దేశంలో నిరుద్యోగిత మరింతగా పెరిగింది. 2019లో భారతదేశంలో 134 మిలియన్ల మంది ప్రజలు అంతర్జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు, అంటే రోజుకు కేవలం 2.15 డాలర్లతో జీవనం సాగిస్తున్నారు. కరోనా మహమ్మారి కారణంగా ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది, ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 మిలియన్ల మంది పేదరికంలో ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పేదలకు భారతదేశం నిలయంగాఉంది. 2030నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే ప్రమాదంఉందని ప్రపంచబ్యాంకుకు సంబంధించిన ఎస్‌డీజీ అట్లాస్ నివేదిక పేర్కొంది. 2021లో సుమారు 973 మిలియన్లమంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేక పోతున్నారు. ఇది ప్రస్తుత జనాభాలో 68.5 శాతానికి పైగా ఉంది. నిరుద్యోగం మరింతగా పెరగడం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం కారణంగా అప్పటి నుండి పరిస్థితి మరింతగా దిగజారింది. ఈ నేపథ్యంలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోవడం, జీవనోపాధి వనరులు ఎండిపోవడం భవిష్యత్తు మరింత భయానకంగా ఉంది. సంపదను కొందరి చేతుల్లోకి పోగుచేసుకోవడం(క్రోని కేటిటలిజం) కోసం నిరుద్యోగ వృద్ధి వ్యూహాన్ని అనుసరించడం కంటే ప్రజలను మానవ కేంద్రంగా మార్చడం ద్వారా ప్రజలను రక్షించడానికి మోదీ ప్రభుత్వం తన ఆర్థిక విధానాలను మార్చవలసి ఉంది.

రుణానందలహరి

చింతపట్ల సుదర్శన్

ఆకాశవీధిలో, రోడ్లమీద ట్రాఫిక్‌ను జామ్ చేసే గేదెల్లా విచ్చలవిడిగా తిరుగాడుతున్నవి నల్లమబ్బులు. అవి ఒకదాన్నొకటి ఢీకొడితే తడిసి ముద్దయిపోవల్సిందే, ఈ షాపు వాడింకారాలేదు. అనుకుంటూ అసహ్యంగా తోకూపుతూ బోనులో చిరుతలా అటూఇటూ తిరగసాగింది డాగీ.అధికార పార్టీ ఆగడాలను అడ్డుకోడానికి నిరాహారదీక్షలూ, నిరసనలూ, జైలుభరోలు, బందులు బదులుగా ప్రతిపక్షాలు 'ప్రెస్‌మీట్లూ', 'బూతు స్టేట్ మెంట్లూ' ఇస్తున్నారు కనుక ఈ షాపు 'బంద్' కారణంగా మూతపడలేదు. తెరవబడు తుందిలే అన్న ధీమాలోఉన్న కుక్కపేగులు రకరకాలరాగాలు అందు కుంటున్నప్పుడు అటుగావచ్చింది మరోకుక్క దాని నోటిలో ఓ ప్లాస్టిక్ కవరుంది.

ఏరోయ్! ఏంటిది? ఎక్కడ్నించి కొట్టుకొచ్చావు అన్నది డాగీ. ఓనరు ఊరెళ్లినట్టున్నాడు. ఇవాళ మటన్‌షాపు 'క్లోజ'ని పై రోడ్డుకి వెళ్లా. ఓ కోన్ కిస్కా గొట్టంగాడు కుడిచేత్తో ఫోన్ పట్టుకుని ఎడమచేత్తో కవరు సంగతి పట్టించుకోలేదు. ఏం జరిగిందో వాడికి అర్థం అయ్యేలోపు అందుకుని వచ్చేశా అంటూ కవర్‌ని బోర్లేసింది, ఆ వచ్చిన కుక్క. అబ్బ! ఎంత ఫుడ్డో. భలేచాన్సు కొట్టావులే. బాగా ఆకలిగాఉంది ఓ ఎముక అప్పుగా ఇవ్వరాదూ

రంగస్థలం

అంది డాగీ. అప్పా! అంటే ఏమిటీ? చెప్తా. తేరగా దొరికిందికదా అని మాయదారి మనుషుల్లా మొత్తం మెక్కావో 'స్టమక్ పెయిన్' వచ్చేను. అప్పు అంటే నువ్వు నాకు ఒకటి ఇచ్చావనుకో రేపో, ఆ మర్నాడో నీది నీకు వడ్డీ పుచ్చుకు కొడతా. నువ్వు ఇచ్చిందానికి మరోటి కలిపి ఇస్తా. నీ ముఖంలో ప్రపంచ బ్యాంక్ కనిపిస్తున్నది ప్లీజ్! యివ్వవా అంది డాగీ.

సరేలే! మనిషి భాష తెల్సిందానివి నువ్వు. మన మాతృభాషలో అడిగితే ఇవ్వకుండా ఉంటానా అప్పు అని ఓ ఎముక డాగీకి అందించింది. స్వజాతి మీద అభిమానంతో మరో కుక్క సాయంత్రం కావస్తుంటే 'అప్పే చేయని వాడు గాడిద' అంటూ హుశారుగా పాడుకుంటూ అరుగు ఎక్కింది డాగీ.

ఏంటిది 'బ్రో' నా మీద పాటా బినాకా గీత్ మాలా అంది అప్పటికే అరుగుమీద సెటిలైన గాడిద. సారీ 'బ్రో' ఇవ్వాళ అప్పుచేసి పప్పు కూడు కాదు. నాన్‌వెజ్ కూడు తినాల్సివచ్చింది. అప్పుల అప్పారావు నయ్యాను కదా అందుకే పాట పాడా అంది డాగీ కాళ్లు బార్లా చాపుకు కూచుంటూ. అలాచెప్పు అప్పు తప్పు అని తెలిసీ చేసేవాళ్లు మనుషులే కాని గాడిదలవరు గాడిదలవకుండా ఉంటానికే అప్పులు చేసేది కొందరైతే, తిన్నది చాలక, చాలినాఅరక్క అప్పులుచేసే వాళ్లు కొందరు. బాగుంది బాగుంది అంధకార మలమినప్పుడు అప్పులకై వెతకాలి. అప్పు చేతకానివాడు అధికారం చెయ్యలేడు అంది డాంకీ. తెలుగు రాష్ట్రాల్లోని మనుషుల్లో మూడొంతుల మది 'వాట్సప్పు'ల పుణ్యమాని కవులైపోయారు. ఇక మీరిద్దరే మిగిలారు కానీండి రుణ ప్రపంచం, రుణ ప్రపంచం, రుణ ప్రపంచం పిలిచింది. పదండి ముందుకు పదండి తోసుకు రిజర్వు బ్యాంకుకు పోదాం పోదాం అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి.

అన్నా వచ్చావా? మందో మాకో తెచ్చుకున్నావా? అని అడిగింది డాగీ. ఎవరికి తెలియని ఏవో బ్రాండులు వచ్చాయి. లేబళ్లు వేరే అయినా సారా ఒకటే అయితేనేం ధరలు చుక్కలచుట్టూ చక్కర్లు కొడుతున్నాయి. కొనడానికి అప్పిచ్చేవాడేడీ అన్నాడు అబ్బాయి. రాష్ట్రమే అప్పుల నదిలో తిప్పల పడవై మునిగి తెలుతుంటే నీకు అప్పిచ్చే వైద్యుడే దొరకలేదా అంది డాంకీ. నాలాగా అప్పుతీసుకుని వడ్డీతో సహా చెల్లించాల్సిన అవసరం లేని రాజులకే చెల్లుతుంది ప్రజల సొమ్ము రాళ్లపాలు చెయ్యడం. అప్పు ఉంటే నాలాంటి బక్క ప్రేవుల జీవికి నిద్రేపట్టదు అన్నాడు అబ్బాయి. అవును అందిన కాడికి అప్పులు చేసి బ్యాంకులు దివాలా తీయించి విదేశాలకు చెక్కేస్తే ఘరానా బాబులకు అప్పు అనగా 'జుజుబీ' అన్నమాట. పోనీ అక్కడెక్కడో రేషన్ బియ్యానికి బదులు డబ్బులిస్తున్నార్ట. తెచ్చుకు తాగచ్చుగా అంది డాగీ. అది మన రాష్ట్రం కాదుకదా. మనవాళ్లు కూడా చౌక బియ్యానికి బదులు ఓ ఫుల్లూ, బిస్లరీ ఇస్తే సరిపోతుంది. మంచి మనిషికి మంచి రోజులు రాకపోవులే అన్నాడు అబ్బాయి నవ్వుతూ.

నీలాంటివాళ్లు అప్పుచేస్తే పీకపట్టుకుంటారు అప్పులోళ్లు. మరి ప్రభుత్వాలు అప్పుచేస్తే ఎవరి పీక పట్టుకుంటారు అనడిగింది డాంకీ. ఇంకెవరిది ప్రజల పీకే. మన సర్కారు ప్రతి మంగళవారాన్ని 'అప్పుల డే' గా పాటిస్తున్నది. ఈ మధ్యే రెండువేలకోట్లు అప్పుతెచ్చింది కాని తెచ్చినోడికి ఏ బరువూ భారమూ ఉండదు. ఆర్చేది, తీర్చేదిప్రజలే. పన్నులే అన్నా డబ్బాయి. అదేంటన్నా తెచ్చినోడికి జవాబుదారీ లేదా అంది డాగీ. ఎలా ఉంటుంది ఏ ఇరవైఏళ్ల కోసమో, ఏదో ఎనిమిదో శాతం వడ్డీతో తెచ్చిన వాడు ఉండాలిగా అప్పటికి. ఎప్పటికీ చిక్కేది చిక్కుల్లో పడేది ప్రజలే కదా అంది డాంకీ. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే అప్పో సొప్పో చెయ్యకతప్పదు మరి. ఉక్కుఫ్యాక్టరీ అమ్మకుండాఉండాలా, అనేకఉద్యోగాలు ఇవ్వాలా, రోడ్లు వెయ్యాలి నీళ్లూ కరెంటూఇవ్వాలి అసలు ఇంకా ఎన్నెన్నోచెయ్యాలి ప్రత్యేక హోదా కోసం విమానాల్లో రాకపోకలు సాగించాలా వద్దా అంది డాగీ.

అబ్బో దంచావులే ఊక. అప్పులు తెచ్చేది రాష్ట్రం అభివృద్ధికి కాదోయ్ ప్రజలు దివాళా తీయడానికి. అవునోయ్ సంక్షేమ పథకాల అమలుకోసం, ఉచితంగా ఉచితాలు ఇవ్వడంకోసం అంటే ఓట్లు దోచుకోవడం కోసమే. అప్పుచేసి పబ్బం గడుపుకొని మళ్లీ మళ్లీ అప్పుచేసే అధికారం కోసమే ఆ ఆత్మానందంకోసమే! అర్జంటుగా వెళ్లి అప్పు సంపాదించాలి అంటూ అరుగు దిగాడబ్బాయి. అప్పులుచేసే ప్రభుత్వాలు గాడిదలకు రోజూ ఉచితంగా న్యూస్ పేపర్ అందిస్తే బాగున్ను అంది గాడిద. అప్పుచేసి తిన్నానివ్వాళ. మనిషినీ కాను. అధికారమూ లేదు, రేపు ఎలాగైనా అప్పు తీర్చేయాలి అంది డాగీ నిద్రపోవడానికి 'ట్రై' చేస్తూ.

కోర్ ఇంజనీరింగ్‌కు పెరుగుతున్న డిమాండ్

డా. ముచ్చుకోట సురేష్‌బాబు

గత మూడు సంవత్సరాలలో, ఇంజనీరింగ్ కళాశాలల్లో కృత్రిమ మేథస్సు(ఏఐ) డేటాసైన్స్ కోర్సులను తమ పాఠ్యాంశాల్లో చేర్చుకునే ధోరణి పెరుగుతోంది. ఈ సైన్స్‌లో నిపుణులకు డిమాండ్ వివిధ పరిశ్రమలలో విపరీతంగా పెరిగింది. ప్రక్రియలను మెరుగుపరచడానికి, అంతర్‌దృష్టిని పొందేందుకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి కంపెనీలు ఏఐ డేటా-ఆధారిత నిర్ణయం తీసుకోవడంపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఉద్భవిస్తున్న ఉద్యోగ అవకాశాలకోసం విద్యార్థులను సిద్ధం చేయవలసిన అవసరాన్ని ఇంజనీరింగ్ కళాశాలలు గుర్తించాయి. ఏఐ డేటాసైన్స్ వివిధ పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న రంగాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇంజనీరింగ్ కళాశాలలు తమ గ్రాడ్యుయేట్లు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించు కోవడానికి మరింత అభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉన్నారని నిర్ధారించుకోవాలి. కృత్రిమ మేథస్సు డేటాసైన్స్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ సహా అనేక రకాల ఇంజనీరింగ్ విభాగాలలో అప్లికేషన్‌లను కలిగి ఉన్నాయి. ఈ కోర్సులను చేర్చడం ద్వారా, ఇంజనీరింగ్ కళాశాలలు ఇంటర్ డిసిప్లినరీ సహకారాన్ని పెంపొందించడం, మల్టీ డిసిప్లినరీ పని వాతావరణం కోసం విద్యార్థులను సిద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఏఐ డేటాసైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు పుష్కలంగా పరిశోధన అవకాశాలను అందిస్తాయి. ఈ కోర్సులను పాఠ్యాంశాల్లోకి చేర్చడం ద్వారా, కళాశాలలు ఏఐ అల్గారిథమ్‌లు, మెషీన్ లెర్నింగ్, డేటా విశ్లేషణ ఇతర సంబంధిత రంగాలకు సంబంధించిన పరిశోధన ప్రాజెక్టులను అన్వేషించడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తాయి.

డేటాసైన్సు కోర్సులను అందించడం ద్వారా వారు ఈ అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ఆకర్షించగలరు. అలాగే ఇతర సంస్థల నుంచి తమను తాము వేరు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ కళాశాలలు ఏఐ డేటాసైన్స్ కోర్సులను చేర్చడం, కోర్ ఇంజనీరింగ్ సూత్రాలలో బలమైన పునాదిని నిర్వహించడం మధ్య సమతుల్యతను సాధించడం ముఖ్యం. ఈ అభివృద్ధి చెందుతున్న రంగాలు విలువైనవి అయినప్పటికీ, సాంప్రదాయ ఇంజనీరింగ్ విభాగాలలో అవసరమైన ప్రాథమిక జ్ఞానం నైపుణ్యాలను కప్పి వేయకూడదు. సమగ్ర ఇంజనీరింగ్ విద్యలో ఇంజనీరింగ్ ప్రాథమిక అంశాలు వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించగల సామర్థ్యం గల గ్రాడ్యుయేట్‌లను ఉత్పత్తి చేయడానికి కృత్రిమ మేథస్సు డేటాసైన్స్‌లో ప్రత్యేక జ్ఞానం రెండింటినీ కలిగి ఉండాలి. ఇంజనీరింగ్ పాఠ్యాంశాల్లో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక ప్రతికూల ఫలితాలు వస్తాయి. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన ప్రాథమిక జ్ఞానం నైపుణ్యాలను అందిస్తాయి. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు ఇంజనీరింగ్ విభాగాలకు ఆధారమైన ప్రాథమిక సూత్రాలపై సమగ్ర అవగాహనను అందిస్తాయి. ఈ శాఖలను నిర్లక్ష్యం చేయడం వల్ల కీలకమైన ఇంజినీరింగ్ కాన్సెప్ట్‌లు, థియరీలు, మెథడాలజీలపై అసంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. ఈ పునాది లేకపోవడం సమస్య-పరిష్కార సామర్థ్యాలకు ఆటంకం కలిగించవచ్చు. వాస్తవ-ప్రపంచ దృశ్యాలలో ఇంజనీరింగ్ సూత్రాల అనువర్తనానికి ఆటంకం



కలిగిస్తుంది.

ఇంజనీరింగ్ రంగంలో సాంకేతికత నిరంతరం అభివృద్ధి చెందుతోంది. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను నిర్లక్ష్యం చేయడం వల్ల కొత్త పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వినూత్న ఇంజనీరింగ్ పద్ధతులకు బహిర్గతం కాకపోవచ్చు. ఇది గ్రాడ్యుయేట్‌లకు సాంకేతిక పురోగతికి అనుగుణంగా వారి వృత్తిపరమైన వృత్తిలో సంబంధితంగా ఉండటాన్ని కష్టతరం చేస్తుంది. ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌లకు వివిధ విభాగాలలో సహకారం అవసరం. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను నిర్లక్ష్యం చేయడం వలన గ్రాడ్యుయేట్‌లు, ఇతర ఇంజనీరింగ్ రంగాలకు చెందిన నిపుణులతో సమర్థవంతంగా సహకరించే సామర్థ్యాన్ని పరిమితం చేయవచ్చు. ఇది ఇంటర్ డిసిప్లినరీ సమస్య-పరిష్కారాన్ని అడ్డుకుంటుంది. విభిన్న దృక్కోణాలు, నైపుణ్యం నుండి ఉత్పన్నమయ్యే ఆవిష్కరణల సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. అనేక ఇంజనీరింగ్ వృత్తులకు వృత్తిపరమైన అక్రిడిటేషన్ లైసెన్స్ కోసం నిర్దిష్ట విద్యా అవసరాలు అవసరం. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను నిర్లక్ష్యం చేయడంవల్ల గ్రాడ్యుయేట్‌లు ప్రొఫెషనల్ సర్టిఫికేషన్‌లు లేదా లైసెన్సులను పొందేందుకు అవసరమైన విద్యా ప్రమాణాలను అందుకోలేరు. కృత్రిమ మేధస్సు డేటాసైన్స్ కోర్సులను కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో ఏకీకృతం చేయడం వల్ల సైద్ధాంతిక భావనలు ఆచరణాత్మక అనువర్తనాలను మిళితంచేసే చక్కటి విద్యను నిర్ధారిస్తుంది.

మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సహా వివిధ ఇంజనీరింగ్ రంగాలకు ఏఐ డేటాసైన్స్ అంతర్భాగంగా మారుతున్నాయి. ఏఐ డేటాసైన్స్ కోర్సులను కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బ్యాలెన్స్ చేయడం ద్వారా, విద్యార్థులు నిర్దిష్ట ఇంజనీరింగ్ సందర్భాలలో ఈ సాంకేతికతలను ఎలా అన్వయించాలో తెలుసుకోవచ్చు. ఈ ఏకీకరణ సంక్లిష్ట ఇంజనీరింగ్ సమస్యలను పరిష్కరించడానికి ఏఐ డేటాసైన్స్‌ని సమర్థవంతంగా ఉపయోగించుకునే వారి సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఏఐ డేటా సైన్స్ నైపుణ్యాల కోసం పరిశ్రమలలో డిమాండ్ వేగంగా పెరుగుతోంది. అయినప్పటికీ, ఏఐ డేటాసైన్స్ అనేది నిర్దిష్ట ఇంజనీరింగ్ డొమైన్‌లలో అన్వయించాల్సిన సాధనాలు, సాంకేతికతలు అని గుర్తించడం చాలా ముఖ్యం. సాఫ్ట్‌వేర్ కంపెనీలు తరచుగా ఏఐ డేటా సైన్స్‌లో నైపుణ్యంతోపాటు కోర్ ఇంజనీరింగ్ సూత్రాలలో బలమైన పునాదిని కలిగి ఉన్న ఇంజనీర్‌లను కోరుకుంటారు. బ్యాలెన్స్‌డ్ కరిక్యులమ్ అనేది గ్రాడ్యుయేట్‌లు పరిశ్రమ డిమాండ్‌లను సమర్థవంతంగా తీర్చడానికి అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉన్నారని నిర్ధారిస్తుంది. మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సహా వివిధ ఇంజనీరింగ్ రంగాలకు ఏఐ డేటా సైన్స్ అంతర్భాగంగా మారుతున్నాయి. ఏఐ డేటా సైన్స్ కోర్సులను కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బ్యాలెన్స్ చేయడం ద్వారా, విద్యార్థులు నిర్దిష్ట ఇంజనీరింగ్ సందర్భాలలో ఈ సాంకేతికతలను ఎలా అన్వయించాలో తెలుసుకోవచ్చు. ఈ ఏకీకరణ సంక్లిష్ట ఇంజనీరింగ్ సమస్యలను పరిష్కరించడానికి ఏఐ, డేటాసైన్స్‌ని సమర్థవంతంగా ఉపయోగించుకునే వారి సామర్థ్యాన్ని పెంచుతుంది. ఏఐ డేటా సైన్స్‌కు తరచుగా కోర్ ఇంజనీరింగ్ విభాగాలతో ఇంటర్ డిసిప్లినరీ సహకారం అవసరం. ఉదాహరణకు, స్వయం ప్రతిపత్తి వాహనాలను అభివృద్ధి చేయడానికి మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఏఐ అల్గారిథమ్‌లలో నైపుణ్యం అవసరం. కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతోపాటు ఏఐ డేటాసైన్స్ కోర్సులను చేర్చడం ద్వారా, విద్యార్థులు ఇంటర్ డిసిప్లినరీ ప్రాబ్లమ్-సాల్వింగ్‌ను నేర్చుకుంటారు. అలాగే టీమ్‌లలో సమర్థవంతంగా పనిచేయడం తెలుసుకుంటారు.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

వ్యాపారాలను దెబ్బతీసిన మణిపూర్ హింస

ఇంఫాల్: మణిపూర్‌లో రెండు నెలలుగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో ఆర్థిక కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోవడంతో రాష్ట్రంలోని వ్యాపార వర్గాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మే 3న మొదలైన హింసాకాండ వల్ల అన్ని వర్గాల ప్రజలు, వారి ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతిన్నాయని రాష్ట్రంలోని అనేక మంది పారిశ్రామిక వేత్తలు సోమవారం చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల వెలుపల బహుళ జాతి కంపెనీలలో సుదీర్ఘ సేవలందించి మణిపూర్‌కు తిరిగి వచ్చిన కార్పొరేట్ వ్యాపార వేత్తలు ఇప్పుడు తమ సొంత రాష్ట్రంలో సమయం, డబ్బును పెట్టుబడి పెట్టే వారి స్వంత నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. 'ప్రభావం భారీగా ఉంది. సంఘాలతో సంబంధం లేకుండా దాదాపు ప్రతి ఒక్కరూ ప్రభావితమయ్యారు. మే 3కి ముందు జనజీవనం చాలా సాధారణం. గత రెండేళ్లుగా మనం ప్రగతి పథంలో ఉన్నాం. మేము కోవిడ్-19 ప్రభావం నుంచి కోలుకుంటున్నందున వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజలు రోజువారీ జీవితంలో పురోగమిస్తున్నారు' అని తెలిపారు. 'అప్పుడు ఇది (జాతి ఘర్షణలు) జరిగాయి. 'అప్పుడు ఇది (జాతి ఘర్షణలు) జరిగింది. ఇప్పుడు మన జీవితాలు మారిపోయాయి. మనుషులు వ్యాపారం చేసే విధానం కూడా మారిపోయింది. వాస్తవానికి, ఇది మమ్మల్ని చాలా సంవత్సరాల వెనక్కి నెట్టింది' అని యాడ్బుల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు యైఖోంబా నింగ్థెమ్బా పీటీఐకి చెప్పారు. వ్యాపార వర్గాలపై ప్రభావం గురించి మాట్లాడుతూ ఈ రంగం దెబ్బతింటుందని అన్నారు. 'అన్ని సాధారణ లావాదేవీలు ఆగిపోవడమే కాకుండా ఇంటర్‌నెట్‌పై ఆధారపడే వ్యాపారాలు నిలిచిపోయాయి. మా రుణాలను చెల్లించడానికి మాకు ఇంటర్‌నెట్ అవసరం. వినియోగదారులు మాకు చెల్లించలేరు. ఇంటర్‌నెట్ లేనందున జీఎస్‌టీని సకాలంలో ఫైల్ చేయలేక పోవడంతో జీఎస్‌టీ ఫైలింగ్ ప్రభావితం అయ్యింది' అని నింగ్థెమ్బా చెప్పారు. నింగ్థెమ్బా బెంగళూరులోని ఒక బహుళ జాతి కంపెనీలో 15 సంవత్సరాలకు పైగా పని చేస్తున్నారు. 2018లో తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించేందుకు తన స్వగ్రామానికి తిరిగి వచ్చారు. యాడ్బుల్ సొల్యూషన్స్ అనేది క్లౌడ్-ఆధారిత ఐటీ సంస్థ. ఇది కంపెనీలకు బీ2బీ డిజిటల్ వ్యాపార వేదికలను అందిస్తుంది. 'మహమ్మారి వచ్చినప్పుడు మేము 2019-20లో దూసుకుపోతున్నాము. కోవిడ్-19 తర్వాత మేము మణిపూర్‌లో చాలా రిటైల్, ఎఫ్అండ్‌బీ వ్యాపారాలకు సేవలు అందిస్తున్నాము. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) లో భాగమైన ఈశాన్య ప్రాంతం నుంచి మేము మొదటివారం. 'మళ్లీ వచ్చి మణిపూర్‌లో వ్యాపారం ప్రారంభించడం సరైన నిర్ణయమేనా అని ఇప్పుడు మేము ప్రశ్నించుకుంటున్నాము. మా రాష్ట్రాన్ని ఉన్నత స్థానానికి చేర్చడం, మరింత వెలుగులోకి తీసుకురావడమే మా ఉద్దేశం. అందుకే తిరిగి వచ్చాను' అని తెలిపారు. వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని సంగైథెల్ గ్రామానికి చెందిన స్టాక్ బ్రోకర్ ఎన్.సందీప్ మైతేయ్ అన్నారు. 'రవాణా లేదు. ఇంటర్‌నెట్ లేదు. ఇంటర్‌నెట్ లేకుండా మనం డబ్బును ఎలా బదిలీ చేయవచ్చు? రవాణా లేకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యం కాదు. అంటే పురోగతి శూన్యం అని ఆయన అన్నారు. వర్గాల మధ్య ఘోరమైన ఘర్షణలు, అపనమ్మకం పరిశ్రమలకు దీర్ఘకాలిక నష్టం కలిగించాయని పేర్కొన్న సందీప్, ఇది సామాన్య ప్రజల జీవితాలపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. 'ఆస్పత్రిలో ఉన్నవారికి, వృద్ధులు, మైనర్ పేమెంట్లకు డబ్బు రావడం లేదు. వారి చికిత్స ప్రభావితమవుతుంది. ఇది ఇక్కడ చాలా బాధాకరమైన పరిస్థితి. నేను ఒక్క సంఘం గురించి మాట్లాడటం లేదు. నేను మైతేయి అయినప్పటికీ, హింస మణిపూర్‌లోని ప్రతి వర్గాన్ని ప్రభావితం చేస్తోంది' అని ఆయన అన్నారు.

బిట్ కాయిన్ స్కామ్‌పై సిట్

కర్నాటక హోంమంత్రి పరమేశ్వర వెల్లడి

బెంగళూరు: బిట్ కాయిన్ కుంభకోణంపై తిరిగి విచారణ జరిపేందుకు సీఐడీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసినట్లు కర్నాటక హోంమంత్రి జి.పరమేశ్వర సోమవారం ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో 2021లో బిట్ కాయిన్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పెద్ద తలకాయలు పాత్ర ఉండటంతో ఈ కుంభకోణాన్ని బయటికి రాకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించినట్లు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ విమర్శించింది. శ్రీకృష్ణ రమేశ్ అలియాస్ ఈ కేసులో ప్రధాన నిందితుడు. రాష్ట్ర ప్రభుత్వ ఈ-ప్రొక్యూర్‌మెంటు వెబ్‌సైట్‌ను ప్రధాన నిందితుడు హ్యాక్ చేశాడు. రూ.11.5 కోట్లను దోచుకున్నాడు. ఈ కేసుతో క్రిప్టోకరెన్సీ అపహరణ, మాదక ద్రవ్యాల వ్యాపారం, సైబర్ ఘోరాలు కలిసి ఉన్నాయి. క్రిప్టోకరెన్సీ కుంభకోణం దర్యాప్తుకు ఏర్పాటు చేసిన సిట్‌కు అదనపు డీజీపీ మనీశ్ ఖర్బీకర్ నాయకత్వం వహిస్తారని హోంమంత్రి చెప్పారు. సాంకేతిక నిపుణులకు ఏడీజీపీ సహకరిస్తారన్నారు. తాము అధికారంలోకి వస్తే బిట్ కాయిన్ కుంభకోణాన్ని తిరిగి దర్యాప్తు జరిపిస్తామని ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిందని పరమేశ్వర తెలి పారు. ప్రత్యేక దర్యాప్తు బృందానికి కేసును అప్పగించడానికి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, అప్పగించామన్నారు. తాము సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సిట్‌తోనే న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. ఏడీజీపీ ఖర్బీకర్ పూర్తి బాధ్యతతో దర్యాప్తు చేస్తారు. ఈ కేసు సైబర్ నేరానికి సంబంధించినందున ఆయన సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుంటారని, సాంకేతిక అంశాలకు సంబంధించిన ఇంకేమైనా సమస్యలు ఉంటే భిన్న వర్గాల తోడ్పాటు తీసుకుంటారని మంత్రి పరమేశ్వర విలేకరుల సమావేశంలో వివరించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల సహకారం తీసుకునే అవకాశం గురించి స్పందిస్తూ అవసరమైతే తీసుకోవాల్సిందిగా సిట్‌కు సలహా ఇస్తామని మంత్రి తెలిపారు. అన్ని అంశాలను పరిగణించిన తర్వాతే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇలాంటి కేసులు పునరావృతం కాకుండా దర్యాప్తు జరుగుతుందని, దర్యాప్తు చాలా లోతుగా ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో చాలా లోపాలు ఉన్నాయని, సిట్ ఇప్పుడు వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తుందన్నారు. బిట్ కాయిన్ కేసుల విచారణకు రెండు ప్రత్యేక కోర్టులో ఏర్పాటు చేసే అవకాశం ఉందా అని అడుగగా ముందు దర్యాప్తు ప్రారంభం కావాల్సి ఉందని, ఒకవేళ అవసరమైతే ప్రభుత్వం అప్పుడు నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తెలిపారు.

రాష్ట్రాలకు 'ఆర్థిక' పారదర్శకత అవశ్యం: నీతిఆయోగ్ సీఈవో



న్యూఢిల్లీ: రాష్ట్రాలకు ఆర్థికపరంగా పారదర్శకత అవసరమని నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. పారదర్శకంగా ఉండటం వల్ల మార్కెట్ నుంచి వనరులు పొందవచ్చన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సామాజిక, ఆర్థిక పురోగతికి కేంద్రం (సీఎస్ఈపీ) సెమినార్‌లో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రంతో పాటు రాష్ట్రాల అప్పుల నిర్వహణలో సమర్థత కోసం ఆర్థిక మండలి తరహా వ్యవస్థ ఉండాలని చెప్పారు. ఏకరూపత కంటే పారదర్శకత ముఖ్యమని నొక్కిచెప్పారు. ఏదో ఒక విధమైన నివేదిక పద్ధతులను అనుసరించడం రాష్ట్రాలకు అవసరమని, పారదర్శకతకే మార్కెట్ విలువ ఉంటుందని అన్నారు. గతేడాది ఐదు దక్షిణాది రాష్ట్రాలకు ఆఫ్ బడ్జెట్ రుణాలు 93శాతంగా ఉంటే పశ్చిమ బెంగాల్, పంజాబ్, రాజస్థాన్ వంటి అత్యధిక లోటు రాష్ట్రాల ఆఫ్ బడ్జెట్ రుణం తక్కువగా ఉండటమే ఇందుకు ఉదాహరణగా సుబ్రహ్మణ్యం చెప్పారు. మార్కెట్ క్రమశిక్షణ వల్ల పశ్చిమ బెంగాల్, పంజాబ్, రాజస్థాన్ కంటే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు రుణమిచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు.

తమిళనాడు లేక కర్నాటక జారీచేసే పత్రాలను తీసుకునేవారు ఉన్నారుగానీ పశ్చిమ బెంగాల్ లేక పంజాబ్‌కు పత్రాలు తీసుకునే వారు లేరని అన్నారు. అభివృద్ధి చెందిన బాండ్ మార్కెట్ లేకపోతే కేంద్రాన్ని ఆశ్రయించాలని, ఆర్బీఐ మార్గాన వనరులు సమకూర్చుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. అభివృద్ధి చెందిన బాండ్ మార్కెట్లు ఉన్న రాష్ట్రాలు పాదర్శకతకు ప్రాధాన్యతివ్వాలని, మార్కెట్ క్రమశిక్షణగా ఉంటే పరిస్థితిలో మెరుగుదల ఉంటుందన్నారు. అదనపు బడ్జెట్ వనరుల(ఈబీఆర్)ల్లోనూ పారదర్శకత అవసరమని సుబ్రహ్మణ్యం చెప్పారు. సెస్‌లు, సర్‌చార్జీలను ఆదాయం కోసం పెంచడంతో పీఎంఎఫ్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్) చట్టాన్ని ఆమోదించే పరిస్థితి లేదన్నారు. కేంద్ర పథకాలను పెంచడంతో రాష్ట్రాలు రూ.4లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోందని సుబ్రహ్మణ్యం చెప్పారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలపై సమగ్ర నివేదిక ఇవ్వండి

ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: మణిపూర్‌లో శాంతి భద్రతల మెరుగుదలకు, పునరావాసానికి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. గిరిజన తెగల మధ్య ఘర్షణ హింసకు దారితీయడంతో మణిపూర్ రాష్ట్రం తగులబడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. మణిపూర్‌లో హింసకు సంబంధించిన కేసుల విచారణ ఈనెల 10న జరుగుతుందని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. రాష్ట్రంలో తాజా పరిస్థితులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, పునరావాస కేంద్రాలు, శాంతి భద్రతలు, ఆయుధాల స్వాధీనాల వివరాలు ఉండాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. రాష్ట్రంలో భద్రతా బలగాల మోహరింపు, కర్ఫ్యూ వేళలను 24 గంటల నుంచి ఐదు గంటలకు తగ్గించడం, శాంతి భద్రతల స్థితిని తుషార్ వివరించారు. పోలీసులు, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లు, సీఏపీఎఫ్‌కు చెందిన 114 కంపెనీలు రాష్ట్రంలో మోహరించినట్లు తెలిపారు. కుకీ వర్గీయుల తరపు సీనియర్ న్యాయవాది కోలిన్ గోంజాల్వెజ్ ఈ కేసుకు మతపరమైనదిగా మార్చడం సరికాదని తుషార్ అన్నారు. గోంజాల్వెజ్ వాదనలు వినిపిస్తూ 'కుకీలను హతమారుస్తామని వార్తాసంస్థ ద్వారా తీవ్రవాదులు హెచ్చరికలు చేస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కుకీలపై హింసను రాష్ట్ర ప్రభుత్వం పేరేపిస్తోంది' అని అన్నారు. మయితె వర్గీయులకు ఎస్టీ హోదాపై హైకోర్టు ఆదేశాలను బీజేపీ ఎమ్మెల్యే సవాల్ చేసిన పిటిషన్, ఈశాన్య రాష్ట్రంలో హింసపై సిట్ విచారణను కోరుతూ గిరిజన ఎన్జీవో దాఖలు చేసిన వాజ్యంతో పాటు మణిపూర్‌లో పరిస్థితిపై అనేక పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించాల్సి ఉంది. హింసాకాండపై కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తప్పుడు హామీలిచ్చాయని మణిపూర్ గిరిజన ఫోరం పిటిషన్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను గిరిజనులు విశ్వసించడం లేదని, సైనిక రక్షణ కల్పించాలని కోరింది. హింసలో 70 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయినట్లు గోంజాల్వెస్ వెల్లడించారు. మరో ప్రాణం పోదన్న హామీ లేదని చెప్పారు. మయితే వర్గీయులకు ఎస్టీ హోదాపై హైకోర్టు తీర్పుకు సంబంధించిన కేసు విచారణను సర్వోన్నత న్యాయస్థానం ఈనెల 17కు వాయిదా వేయడాన్ని ప్రస్తావించారు. ఇప్పటివరకు 120 మందికిపైగా చనిపోయారు. మే 3న నిర్వహించిన గిరిజన సంఘీభావ మార్చ్‌తో చెలరేగిన హింస తారాస్థాయికి చేరి రాష్ట్రంలో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది.

టమాటా ధర పైపైకి

- ఢిల్లీలో రూ.140కి చేరిక
- కొనలేక వినియోగదారులు విలవిల

న్యూఢిల్లీ: దేశంలో టమాటా ధరలు రోజురోజుకి తారస్థాయికి చేరుతున్నాయి. దీంతో వినియోగదారులు టమాటాలను కొనలేని పరిస్థితి నెలకొంది. వర్షాల కారణంగా ఉత్పత్తి కేంద్రాల నుంచి సరఫరా అంతరాయం కారణంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో టమాటా ధర కిలోకు రూ.140 వరకు పెరిగింది. ఆసియాలోనే అతి పెద్ద హోల్‌సేల్ పండ్లు, కూరగాయల మార్కెట్ అయిన ఇక్కడి ఆజాద్‌పూర్ మండిలో సోమవారం నాటి నాణ్యతను బట్టి టమాటా టోకు ధరలు కిలోకు రూ.60-120 మధ్య ఉన్నాయి. మదర్ డెయిరీకి చెందిన సఫాల్ ఆదివారం కిలో టమాటాను రూ.99 కి విక్రయించింది. ఆన్‌లైన్ రిటైలర్ ఓటీపై సోమవారం హైబ్రిడ్ రకం టమాటాను కిలోకు రూ.140, బిగ్‌బాస్కెట్ కిలోకు రూ.105-110గా పేర్కొంది. 'ముఖ్యమైన ఉత్పత్తి కేంద్రాల నుంచి సరఫరా అంతంత మాత్రంగా ఉండటం టమాటా ధరల పెరుగుదలకు కారణం. వర్షాల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడింది' అని ఆజాద్‌పూర్ టమాటా అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కౌశిక్ పీటీఐకి తెలిపారు. వర్షాల కారణంగా పొరుగున ఉన్న హరియాణా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ నుంచి సరఫరా త్వరగా అయిపోయింది. ఇప్పుడు ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి హిమాచల్ ప్రదేశ్ ఏకైక సరఫరాదారు. కొండ ప్రాంత రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఫలితంగా ఎంచుకోవడం, రవాణాపై ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు. మహారాష్ట్ర, కర్నాటక ఉత్పత్తి కేంద్రాల నుంచి వ్యాపారులు సరఫరా చేయలేకపోతున్నారని, వర్షాల కారణంగా అక్కడ ధరలు అధికంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కౌశిక్ మాట్లాడుతూ '25 కిలోల క్రేట్ ఎక్కడో 2,400 నుంచి 3,000 రూపాయల మధ్య ఉంటుంది. ఉత్పాదక కేంద్రాల్లో కిలో టమాటా ధర కిలో రూ.100-120గా ఉంది. వ్యాపారులు ఇంత ఎక్కువ ధరలకు సరుకును ఢిల్లీకి తీసుకురాలేరు' అని తెలిపారు. రానున్న 15 రోజుల్లో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షపాతం పరిస్థితి మెరుగుపడితే, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో టమాటా సరఫరా మెరుగు పడుతుందని, అప్పటి వరకు ధర స్థిరంగా ఉంటుందని ఆయన అన్నారు. కౌశిక్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) ఆజాద్‌పూర్ సభ్యుడు కూడా. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా టమాటా ధరలు పెరిగాయి. టమాటా ధర పెరగడం 'సీజనల్' దృగ్విషయమని ప్రభుత్వం పేర్కొంది. ఈ సమయంలో, సాధారణంగా, ధరలు ఎక్కువగా ఉంటాయని, అవి రాబోయే 15 రోజుల్లో తగ్గుతాయని తెలిపింది.

అజిత్ పవార్ సీఎం

ఇదే బీజేపీ హామీ: చవాన్

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి అజిత్ పవార్‌కు ఇస్తానని బీజేపీ హామీ ఇచ్చిందని, దీనికి సంబంధించిన కచ్చితమైన సమాచారం తన వద్ద ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ సోమవారం చెప్పారు. అజిత్ పవార్ ఆదివారం ఏక్‌నాథ్ షిండే-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో చేరడంతో మహారాష్ట్ర రాజకీయాలు వేగంగా మారాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్) తదితర పార్టీలు తీవ్రంగా స్పందించాయి. షిండే త్వరలో సీఎం పదవి కోల్పోతున్నారని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ పేర్కొన్నారు. కరడ్‌లో చవాన్ విలేకరులతో మాట్లాడుతూ అజిత్ పవార్ బీజేపీతో వెళతారని తాను బహిరంగంగా మాట్లాడానని, అప్పుడు తాను తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నట్లు గుర్తు చేశారు. అజిత్ బీజేపీతో వెళతాడని తనకు ముందే తెలుసని చెప్పారు. 'అజిత్ పవార్‌కు ఏమి ఇస్తారనే విషయంపై సుదీర్ఘంగా బేరసారాలు జరిగాయి. నాకున్న సమాచారం ప్రకారం అసెంబ్లీ స్పీకర్ సాయంతో ఏక్‌నాథ్ షిండేను పక్కన పెట్టి అజిత్‌కు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని బీజేపీ హామీ ఇచ్చింది' అని చవాన్ చెప్పారు. మహావికాస్ అఘాడీలో శరద్ పవార్ భాగస్వామని, ఆయనకు మద్దతు తెలపడానికే తాను కరడ్ వచ్చానని వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిపక్షాల ఐక్యత వెనుక పవార్ బలంగా నిలబడ్డారని చెప్పారు. మహా వికాస్ అఘాడీ బలంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో షిండే-బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమని, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని అన్యాయంగా కూల్చివేశారన్న సానుభూతి బలంగా ఉందని తెలిపారు. తమ కూటమిని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేసిందని, చివరికి విజయం సాధించిందని చవాన్ పేర్కొన్నారు.

మరోవైపు, శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ పీటీఐతో మాట్లాడుతూ ఏక్‌నాథ్ షిండే కచ్చితంగా ముఖ్యమంత్రి పదవి కోల్పోతారని చెప్పారు. జులై 5న శరద్ పవార్ ఎన్‌సీపీ సమావేశం ఏర్పాటు చేశారని, ఆ తర్వాత తామంతా సమావేశమై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అజిత్ పవార్ ఎపిసోడ్‌తో రానున్న ఎన్నికల్లో మహారాష్ట్రలో అనూహ్య ఫలితాలు వెలువడతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నాకర్ మహాజన్ వ్యాఖ్యానించారు.

జార్ఖండ్ మంత్రిగా బేబీదేవి ప్రమాణ స్వీకారం

రాంచి: జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వంలో మంత్రిగా జార్ఖండ్ మాజీ మంత్రి జాగర్నాథ్ మహతో భార్య బేబీ దేవి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమెతో ప్రమాణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోరెన్, ఇతర కేబినెట్ మంత్రులు పాల్గొన్నారు. పాఠశాల విద్య, అక్షరాస్యత, ఎక్సైజ్‌కు బాధ్యత వహించిన జాగర్నాథ్ మహతో మరణంతో హేమంత్ సోరెన్ కేబినెట్‌లో మంత్రి పదవి ఖాళీ అయింది. గిరిడిహ్ జిల్లాలోని డుమ్రీ నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మహతో, కోవిడ్ -19 సమస్యల కారణంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో ఏప్రిల్ 6 న చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఇక దేవి ప్రస్తుత యూపీఏ ప్రభుత్వంలో అసెంబ్లీకి ఎన్నిక కాకముందే మంత్రి అయిన రెండవ జేఎంఎం నేత. ఇంతకు ముందు, హఫీజుల్ అన్సారీ ఫిబ్రవరి 6, 2021న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత, అతను మే 2, 2021న మధుపూర్ ఉప ఎన్నికలో గెలిచాడు.

ఒడిశా రైలు ప్రమాదం

ఇంకా గుర్తించకుండానే 52 మృతదేహాలు

భువనేశ్వర్: ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాద బాధితుల్లో 50కి పైగా మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉంది. వీటిని ఇక్కడి ఎయిమ్స్ ఆస్పత్రిలో భద్రపర్చారు. కాగా భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఇద్దరు బాధితుల భౌతికకాయాలకు ఇక్కడి సత్య నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించింది. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లోని 81 మృతదేహాల్లో 29 మృతదేహాలను డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించామని, అందులో 22 మృతదేహాల ను దహనం చేసినట్లు ఓ అధికారి తెలిపారు. 'ప్రస్తుతం భువనేశ్వర్ ఎయిమ్స్‌లో రైలు ప్రమాద బాధితుల్లో 52 మంది మృతదేహాలు ఉన్నాయి' అని ఆ అధికారి వివరించారు. జార్ఖండ్‌కు చెందిన దినేశ్ యాదవ్ (31), బీహార్‌కు చెందిన సురేష్ రే (23) అనే ఇద్దరి మృతదేహాలను బీఎంసీ అధికారులు ఆదివారం దహనం చేశారు. కాగా మూడు మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు ఎయిమ్స్ భువనేశ్వర్ ఏర్పాట్లు చేసింది. ఒక మృతదేహాన్ని బీహార్‌లోని మరణించిన వ్యక్తి స్వగ్రామానికి తీసుకెళ్లగా, మరో ఇద్దరు బాధితుల కుటుంబ సభ్యులు సుదీర్ఘ ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని మృతదేహాలను తీసుకెళ్లడానికి ఇష్టపడలేదని ఎయిమ్స్ అధికారి తెలిపారు. భువనేశ్వర్‌లో మృతదేహాలను దహనం చేసేందుకు రెండు కుటుంబాలు అంగీకరించాయని పేర్కొన్నారు. కాగా ఒక మృతదేహం కోసం అనేక క్లెయిమ్‌లు రావడంతో మృతదేహాల నుంచి తీసిన నమూనాలను డీఎన్ఏ పరీక్షకు పంపారు. మిగిలిన 52 మృతదేహాలను గుర్తించడానికి డిఎన్ఎ నమూనా పరీక్ష ఫలితాలు రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

మణిపూర్ సీఎం రాజీనామా కోసం

ఢిల్లీలో యువజన కాంగ్రెస్ ఆందోళన

న్యూఢిల్లీ: మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్‌సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. మణిపూర్‌లో రెండు వర్గాల ఘర్షణను ఇప్పటి వరకు ఆపలేకపోయారని, రెండు మాసాలుగా హింస కొనసాగుతోందని విమర్శించారు. సెంట్రల్ ఢిల్లీలోని ఇండియన్ యూత్ కాంగ్రెస్(ఐవైసీ) కార్యాలయం వెనుక వందలాదిమంది యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నాకు దిగారు. 'ముఖ్యమంత్రీ...రాజీనామా చెయ్' అని రాసిన బ్యానర్లు ప్రదర్శించారు. యువజన కాంగ్రెస్ ఆందోళనతో ఐవైసీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అనేకమంది యువజన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. మణిపూర్‌లో అన్ని మిలిటెంట్ గ్రూపుల వద్ద గల ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని, ముఖ్యమంత్రి సింగ్‌ను తప్పించాలని, బాధితులకు సహాయ ప్యాకేజీని పెంచాలని అంతకుముందు ఐవైసీ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తమకు గిరిజన హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన మెయితీలకు వ్యతిరేకంగా గిరిజన సంఘీభావ ప్రదర్శన జరిగిన తర్వాత మే 3వ తేదీన రెండు వర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. మణిపూర్ హింసలో ఇప్పటి వరకు 120 మంది చనిపోయారు. 3 వేలమందికి పైగా గాయపడ్డారు.

శరద్‌పవార్‌కు గోవా ఎన్‌సీపీ శాఖ మద్దతు

పనాజి: మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో చీలికకు దారితీసిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీ అధినేత శరద్ పవార్‌కు ఆ పార్టీ గోవా యూనిట్ సోమవారం మద్దతు ప్రకటించింది. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జోస్ ఫిలిప్ డిసౌజా పీటీఐతో మాట్లాడుతూ... గోవా యూనిట్ మొత్తం శరద్ పవార్ వెనుక బలంగా ఉందని, ఎన్‌సీపీ నుండి విడిపోదని అన్నారు. 24 ఏళ్ల క్రితం పార్టీని స్థాపించిన తన మామ శరద్ పవార్‌కు షాక్ ఇస్తూ ఎన్‌సీపీ నాయకుడు అజిత్ పవార్ ఆదివారం పార్టీని నిలువునా చీల్చి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే ఎనిమిది మంది ఎన్‌సీపీ నాయకులు మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ శిందే-బీజేపీ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీని పునర్నిర్మించగల శరద్ పవార్ సామర్థ్యాలపై పార్టీకి నమ్మకం ఉందని డిసౌజా చెప్పారు. '15 సంవత్సరాల క్రితం ఇలాంటి సంఘటన జరిగినప్పుడు అతను అలా చేయడం మేము చూశాము' అని ఆయన చెప్పారు.

థానే, పాల్ఘర్ జిల్లాల్లో భారీ వర్షాలు

థానే/పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లు కోతకు గురవడం, ఇళ్లు కూలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురవడంతో జవహర్- ధాబేరి మధ్య రహదారిలో కొంత భాగం కుంగిపోయింది. అయితే ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. కాగా పొరుగున ఉన్న థానే జిల్లాలోని అంబర్‌నాథ్ పట్టణంలో ఆదివారం భారీ వర్షం కారణంగా ఓ భవనం టెర్రస్ గోడ కూలిపోయిందని జిల్లా విపత్తు నియంత్రణ అధికారి తెలిపారు. నాలుగు అంతస్థుల భవనం టెర్రస్ గోడ కూలిపోయిందని, ఆ నిర్మాణం 30 ఏళ్ల నాటిదని పేర్కొన్నారు. అంబర్‌నాథ్ మునిసిపల్ కౌన్సిల్ ఇప్పటికే పట్టణంలోని 210 ప్రమాదకర, 13 అత్యంత ప్రమాదకరమైన భవనాల జాబితాను ప్రచురించింది. కూలిపోయిన నిర్మాణం వాటిలో ఒకటి అని అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా టాయిలెట్‌లోని సీలింగ్ నుంచి పెచ్చులూడిపడటంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. భయాందర్ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో థానె నగరంలో 56.84 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అంబటి స్ఫూర్తి ఆదర్శనీయం

- మానవత్వం మూర్తీభవించిన మహానేత
- సంస్మరణ సభలో వక్తల నివాళి
- భారీగా హాజరైన రాజకీయ నేతలు, పాత్రికేయ పెద్దలు

విశాలాంధ్ర-విజయవాడ: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడిన గొప్ప నాయకుడు అంబటి ఆంజనేయులు అని వక్తలు కొనియాడారు. జర్నలిజం విలువలను కాడటమే కాకుండా పత్రికా కార్మికుల హక్కుల సాధన కోసం ఆయన పోరాడారని, మానవత్వం మూర్తీభవించిన మహామనిషి అంబటి ఆంజనేయులు అని పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో అంబటి ఆంజనేయులు సంస్మరణసభ విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ)జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉన్నతభావాలతో అనేకమంది మిత్రులను సంపాదించుకున్న నాయకుడు అంబటి అని గుర్తుచేశారు విజయవాడలో పుల్లయ్య, నండూరు రామ్మోహన్‌రావు, సి.రాఘవాచారి వంటి మహామహులతో కలిసి పనిచేయటంతో పాటు తుదిశ్వాస వరకు జర్నలిస్టు ఉద్యమంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రభలో సుదీర్ఘ సమ్మెకాలంలో, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి పేపర్లు మూసివేసిన సందర్భాల్లో, కార్మికల వేతనాల కోసం జరిగిన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బల్వీందర్‌సింగ్ సంధూ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రజావ్యతిరేక విధానాలపై జర్నలిస్టులుగా పోరాటం చేద్దామని నిర్ణయించుకున్నామన్నారు. ప్రెస్‌క్లబ్‌కు వచ్చి ఎవరైనా సమస్య చెపితే దాన్ని అర్థం చేసుకుని వెంటనే పరిష్కరించేవారని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో జర్నలిస్టులకు నాయకత్వం వహించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఐజేయూ మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్ సిన్హా మాట్లాడుతూ కేవలం జర్నలిస్టుల కోసం మాత్రమే కాకుండా న్యూస్ పేపర్లలో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం అంబటి పని చేశారని చెప్పారు. ఆల్ ఇండియా న్యూస్ పేపర్స్ ఇండస్ట్రీకి జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఉద్యమ నాయకుడుగా అంబటి...యాజమాన్యాలు, జర్నలిస్టులు, కార్మికులు మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా పోరాటం చేశారన్నారు. దాంతో యాజమాన్యాలు కూడా సానుకూలంగా స్పందించాయన్నారు. అంబటి మరణం మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌కు తీరని లోటు అని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు పేపర్‌లో వచ్చే వార్తకు ప్రామాణికత ఉండేదన్నారు. నాటితరం నుంచి నేటి వరకు జర్నలిస్టు విలువల్ని కాపాడటంలో అంబటి కృషి చేశారని చెప్పారు. కొత్తగా జర్నలిజంలోకి వచ్చేవారు అంబటిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియా నియంత్రణకు పాత్రికేయ పెద్దలు సూచనలు చేయాలన్నారు.

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట రామయ్య(నాని) మాట్లాడుతూ ఎంత సంక్లిష్ట సమస్యనైనా మృదువుగా చెప్పటంలో అంబటి దిట్ట అన్నారు. తనకంటూ ప్రత్యేకమైన పంథాను ఏర్పరచుకున్నారన్నారు. నాయకత్వం, పాత్రికేయం రెండూ వృత్తి వ్యసనాలన్నారు. ఈ రెండింటినీ సమపాళ్లలో న్యాయం చేసిన గొప్ప నాయకుడు అంబటి ఆంజనేయులు అని కొనియాడారు. విజయవాడలో పేపర్ ఉన్నంత కాలం అంబటిపేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లో మాస్ లీడర్‌కు ఉండే ఫాలోయింగ్ అంబటి ఆంజనేయులుకు ఉందన్నారు. జర్నలిస్టులు, కార్మికుల కోసం నిస్వార్థంగా పని చేశారన్నారు. అంబటి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ 60 ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అంబటి చేసిన కృషిని వివరించారు. ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ అంబటి ఆంజనేయులు కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఐజేయూ కార్యదర్శి డి.సోమ సుందర్, కార్యవర్గ సభ్యుడు ఆలపాటి సురేశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంబటి సుబ్బారావు, సీపీఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కస్తూరి, విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, ప్రజాశక్తి సంపాదకులు తులసీదాస్, టీఎస్‌యూడబ్ల్యూజే నాయకులు రామనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, సీనియర్ పాత్రికేయులు సంపత్, భద్రం, మక్కెన సుబ్బారావు, ఎస్‌కే బాబు, వెంకట్రావ్, జర్నలిస్టు ఫోరం నాయకులు అంబటి బ్రహ్మయ్య, పీవీ రావు, మహబూబ్ ఆజం, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ శ్రీనివాసరావు తదితరులు అంబటి ఆంజనేయులు సేవలను కొనియాడారు.

ముందుగా సామ్నా అధ్యక్షుడు నల్లి ధర్మారావు అంబటి ఆంజనేయులు జీవిత విశేషాలను వివరిస్తూ తాను రాసిన పాటను గానం చేసి నివాలులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా యూనిట్ అధ్యక్షుడు చావా రవి అతిథులకు స్వాగతం పలికారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి వసంత్ వందన సమర్పణ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు,సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు వి.వి.కృష్ణారావు, సీఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి తిలక్, ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, అంబటి ఆంజనేయులు కుమారులు అంబటి సంజయ్ కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు రాజశేఖర్ ఫోన్ ద్వారా నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, అంబటి ఆంజనేయులు మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబటి చిత్రపటం ఆవిష్కరణ

అంతకుముందు, పాత్రికేయుల పెన్నిధి అంబటి ఆంజనేయులు సంస్మరణ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ఆవిష్కరించారు. ప్రెస్‌క్లబ్‌లోని ప్రధాన సమావేశం మందిరానికి అంబటి ఆంజనేయులు హాల్‌గా నామకరణం చేశారు.

సాగు సాయం రూ.10వేలు ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాల సమర్పణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణభారంతో ఉన్నారు. దేశంలో ఆత్మహత్యలలో రాష్ట్రం 3వ స్థానంలో ఉన్నది. వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నందున కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో రైతుసంఘం రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాలవద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించి, కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించడం జరిగింది. సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని గ్రామ సచివాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అలాగే సంఘ కార్యదర్శులు జగన్నాథం కర్నూలు జిల్లా పెద్ద టేకూరులో, పి. జమలయ్య ఎన్టీఆర్ జిల్లా కవులూరులో గ్రామ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేయగా, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200కు పైగా గ్రామ సచివాలయాలవద్ద రైతుసంఘ జిల్లా బాధ్యులు

నిరసన కార్యక్రమాలు నిర్వహించి గ్రామ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు 10 వేల రూపాయలు, 2 ఎకరాల వరకు సాగుచేస్తున్న ప్రతి రైతుకు రూ. 20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని, రెండు ఎకరాలకు పైబడిన వారందరికి ప్రతి ఎకరాకు రూ.10 వేలచొప్పున సాయం అందించాలని, డా. స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం (సి2+50) అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, కౌలు రైతుల అన్ని రకాల పంట రుణాలను రెండులక్షల రూపాయల వరకు మాఫీ చేయాలని, ఇందుకోసం కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని రైతు నేతలు సూచించారు. పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90శాతం సబ్సిడీతో అందించాలని, 50 సంవత్సరాలుపైబడిన రైతులు, కౌలు రైతులకు ప్రతి నెల 10 వేల రూపాయలు ఫింఛన్ ఇవ్వాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలనే ఆలోచనను ఉపసంహరించుకొని ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపుకార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు నేతలు వినతిపత్రాలు అందజేశారు.

'పవన్ హన్స్‌'పై కేంద్రం వెనక్కి

న్యూఢిల్లీ : పెండింగ్‌లో ఉన్న చట్టపరమైన కేసుల దృష్ట్యా విజయవంతమైన బిడ్డింగ్ కన్సార్టియం స్టార్9 మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనర్హులుగా ప్రకటించబడినందున పవన్ హన్స్‌కు చెందిన వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను రద్దు చేయాలని ప్రభుత్వం సోమవారం నిర్ణయించింది. పవన్ హన్స్ అనేది ప్రభుత్వం, ఓఎన్‌జీసీకి చెందిన 51:49 సంయుక్త భాగస్వామ్యం. బిగ్ చార్టర్ ప్రైవేట్ లిమిటెడ్, మహారాజా ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్, అల్మాస్ గ్లోబల్ ఆపర్చునిటీ ఫండ్ ఎస్‌పీసీకి చెందిన కన్సార్టియం అయిన స్టార్9 మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు హెలికాప్టర్ సర్వీస్ ప్రొవైడర్‌ను రూ.211.14 కోట్లకు విక్రయించాలని ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్‌లో నిర్ణయించింది. అయితే విజయవంతమైన బిడ్డర్ కన్సార్టియం అల్మాస్ గ్లోబల్ ఆపర్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) లో దానిపై కేసు పెండింగ్‌లో ఉందని వెలుగులోకి వచ్చిన తర్వాత మేలో విక్రయ ప్రక్రియ నిలిపివేయబడింది. ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ ప్రతికూల ఉత్తర్వులను ప్రభుత్వం పరిశీలించిందని సోమవారం పెట్టుబడి, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) ఒక ప్రకటనలో తెలిపింది. 'ప్రత్యామ్నాయ యంత్రాంగం ఆమోదంతో షోకాజ్ నోటీసుకు విజయవంతమైన బిడ్డర్ ప్రతిస్పందనను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత... విజయవంతమైన బిడ్డింగ్ కన్సార్టియం ఎంఎస్ స్టార్ 9 మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌ను పవన్ వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ నుంచి అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంకా, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ కోసం ప్రస్తుత ప్రక్రియ రద్దు చేయబడింది' అని దీపమ్ తెలిపింది. ప్రత్యామ్నాయ యంత్రాంగం రోడ్డు రవాణా, రహదారుల మంత్రి, ఆర్థిక మంత్రి, పౌర విమానయాన మంత్రిని కలిగి ఉంటుంది.

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు నియమాలు త్వరలో

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం తర్వలోనే జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు నియమాలను, సభ్యుల నియామకాలనూ నోటిఫై చేయనుందని సీబీఐసీ సీనియర్ అధికారి శశాంక్ ప్రియా సోమవారం తెలిపారు. జీఎస్టీ మండలి ఆమోదం లభించాక అవి జారీ అవుతాయని చెప్పారు. ఫిక్కీ జీఎస్టీ సదస్సులో ప్రియా మాట్లాడుతూ 'మండలి ఆమోదం తర్వాత నియమాలను నోటిఫై చేసే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. కార్మికశక్తి, వ్యవస్థలను సిద్ధం చేశాం. త్వరలోనే పూర్తి చేయగలమని ఆకాంక్షిస్తున్నాం' అని అన్నారు. ట్రిబ్యునల్ సభ్యుల విద్యా అర్హతలు, పని అనుభవాన్నీ మండలి ఆమోదిస్తుందని చెప్పారు. కొన్ని వ్యాపారాలు ఇప్పటి వరకు నమోదు చేసుకోలేదని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను కచ్చితంగా చేపట్టేందుకు సీబీఐసీ పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని ప్రియా అన్నారు.

మతతత్వంపై పోరు షురూ

- ఎన్‌సీపీని పునర్నిర్మిస్తా
- దేశ విభజనకు బీజేపీ కుట్ర
- కరద్‌లో పవార్ బలప్రదర్శన
- దారిపొడవునా వేలాదిమంది స్వాగతం

కరడ్: బీజేపీపై ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ నిప్పులు చెరిగారు. అన్ని ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సమాజంలో భయాన్ని సృష్టిస్తోందని ఆగ్రహం వెలిబుచ్చారు. మహారాష్ట్రలో, దేశంలో కులాల పేరుతో, మతాల పేరుతో బీజేపీ సమాజంలో చీలికలు తెస్తోందని విమర్శించారు. త్వరలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని పునర్నిర్మిస్తానని శరద్ పవార్ ప్రతిజ్ఞ చేశారు. గురు పూర్ణిమ సందర్భంగా తన రాజకీయ గురువు, మహారాష్ట్ర మొదటి ముఖ్యమంతి యశ్వంతరావు చవాన్ సమాధి వద్ద శరద్ పవార్ సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడికి భారీగా తరలి వచ్చిన మద్దతుదారులను ఉద్దేశించి పవార్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ఇతర పార్టీలను చీల్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలో తమ పార్టీ నాయకులు చిక్కుకున్నారని పవార్ ఆరోపించారు. 'మతతత్వంతో పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది. అజిత్ పవార్ తిరుగుబాటుతో నేను అధైర్యపడటం లేదు. ప్రజల మధ్యకు వెళ్లి పార్టీని పునర్నిర్మిస్తాను. ఎన్సీపీని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించిన వారికి మా సత్తా ఏంటో చూపిస్తాం' అని శరద్ పవార్ ప్రతిజ్ఞ చేశారు. సోమవారం ఉదయం పూనే నుంచి కరడ్‌కు శరద్ పవార్ వెళుతుండగా...ఆయనకు స్వాగతం పలకడానికి దారి పొడవునా వేలాది మంది మద్దతుదారులు బారులు తీరారు. కరద్ వెళ్లడం ద్వారా పవార్ తన బలాన్ని నిరూపించాలని భావించారు. వేలాదిమంది కరద్ వచ్చి ఆయనకు మద్దతు ప్రకటించారు. కరాద్ స్థానిక ఎమ్మెల్యే బాలాసాహెబ్ పాటిల్‌తోపాటు డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ ప్రమాణస్వీకారం సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్యే మకరంద్ పాటిల్ కూడా శరద్ పవార్‌కు స్వాగతం పలకడం విశేషం. మార్గ మధ్యంలో వాహనాన్ని ఆపిన శరద్ పవార్ మద్దతుదారులను కలుసుకున్నారు. కాగా ఆదివారం తిరుగుబాటు చేసిన ఎన్సీపీ కీలక నేత అజిత్ పవార్ తన మద్దతుదారులతో కలిసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరారు. తనకు 40 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు రాజ్‌భవన్‌కు సమర్పించిన లేఖలో అజిత్ పవార్ పేర్కొన్నారు.

'మహారాష్ట్రలోనూ, దేశంలోనూ మత విభజనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. శాంతికాముకలలో భయం సృష్టించే శక్తులపై మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్న మా పార్టీని చీల్చడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. దేశంలో ప్రస్తుతం తప్పుడు ధోరణలు కొనసాగుతున్నాయి. వీటిని ఎంతమాత్రం సహించేది లేదు. మతోన్మాద సిద్ధాంతాల సాయంతో దేశంలో ఇలాంటి దుర్మార్గాలు చోటుచేసుకుంటున్నాయి. దురదృష్టవశాత్తు మా పార్టీ నాయకులు మతోన్మాదశక్తుల ఉచ్చులో చిక్కుకున్నాయి' అని పవార్ ఆగ్రహం వెలిబుచ్చారు. సాహూ మహరాజ్, పూలె, అంబేద్కర్ జన్మించిన మహారాష్ట్ర గడ్డపై గల సామాన్యులు మతోన్మాద శక్తుల ఆగడాలను తిప్పికొట్టాలని పులుపునిచ్చారు. రానున్న కొద్ది నెలల్లో ప్రజల మధ్యకు వెళ్లే అవకాశం తమకు వస్తుందని, ప్రజల సహకారంతో మతోన్మాద శక్తులపై పోరాటం చేయడమే కాకుండా పార్టీని పునర్నిర్మిస్తానని పవార్ స్పష్టంచేశారు. సామాన్యుల ప్రయోజనాలే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో ఏకాభిప్రాయం సాధించడం ద్వారా ఎన్‌సీపీ కీలక నిర్ణయాలు తీసుకుంటుందని, కరద్ నుంచే ఇది ప్రారంభమవుతుందని పవార్ చెప్పారు. కుట్రలు, కుతంత్రాలతో మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా అఘాదీ ప్రభుత్వాన్ని కుప్ప కూల్చారని, ఇది కేవలం మహారాష్ట్రకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. కమల్‌నాథ్ నాయకత్వంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇదే తరహాలో కూల్చారని విమర్శించారు. ఇందుకు మతోన్మాదాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కరద్‌లో వేలామందిమంది ఎన్‌సీపీ కార్యకర్తలతో పాటు ఆ పార్టీ సతారా ఎంపీ శ్రీనివాస్ పాటిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ పవార్‌కు స్వాగతం పలికారు.

నలుగురు ఎన్‌సీపీ మంత్రులపై అవినీతి కేసులు

కొనసాగుతున ఈడీ, ఏసీబీ దర్యాప్తు

ఇప్పుడు వారంతా పునీతులేనా: పవార్

న్యూఢిల్లీ: అక్రమాలు, అన్యాయాలు, అవినీతిని ఉపేక్షించే ప్రసక్తేలేదని, ఎంతటివారినైనా జైలుకు పంపుతామని ఊదరగొడుతున్న బీజేపీ...అనేక కేసులు ఎదుర్కొంటున్న ఎన్‌సీపీ నేతలను తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములను చేసింది. రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకున్న 9 మందిలో నలుగురు ఇప్పటికే మనీలాండరింగ్ కేసులు ఎదుర్కొంటున్నారు. వారి గురించి బీజేపీ ఏమి సమాధానం చెబుతుందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. షిండే-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేసిన నలుగురు అనేక కేసుల్లో ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ), అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) విచారణను ఎదుర్కొంటు న్నారు. మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసుల్లో ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అజిత్ పవార్, కేబినెట్ మంత్రులు ఛగన్ భుజబల్, హసన్ ముష్రిఫ్ నిందితులుగా ఉన్నారు. సహకార బ్యాంకు కుంభకోణం, నీటిపారుదలశాఖ కుంభకోణంలో అజిత్ పవార్ నిందితుడు. మహారాష్ట్ర రాష్ట్ర సహకార బ్యాంకు ఇచ్చిన రుణాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తోంది. ఆరోపణల ఆధారంగా మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ కేసు నమోదు చేసింది. మహా వికాస్ అఘాదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆధారాలు లేవన్న సాకుతో ఆర్థిక నేరాల విభాగం కేసును మూసివేసింది. అయితే, ఆర్థిక నేరాల విభాగం నిర్ణయాన్ని ఈడీ 2020లో తీవ్రంగా వ్యతిరేకించింది. 2022లో బీజేపీ తిరిగి అధికారం చేపట్టగానే ఆర్థిక నేరాల విభాగం తన వైఖరి మార్చుకున్నది. విచారణ కొనసాగించాలని నిర్ణయించింది. సహకార బ్యాంకు కేసుతో పాటు జలవనరుల ప్రాజెక్టుల్లో అక్రమాల ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో మహారాష్ట్ర ఏసీబీ విచారణ కొనసాగిస్తోంది. ఈ రెండు కేసుల్లో అజిత్ పవార్ నిందితుడు. జలవనరులశాఖ ప్రాజెక్టు కుంభకోణం కేసులో నిన్ననే మంత్రిగా ప్రమాణం చేసిన అదితి తత్కరే తండ్రి సునిల్ తత్కరే నిందితుడు. ఈ కేసును ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ఆయనను నిందితుడిగా చేర్చనప్పటికీ 2017లో కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో ఆయన పేరును సీబీఐ చేర్చింది. తత్కరేపై ఈడీ కూడా ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. కాగా, వంద కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు కాంట్రాక్టుల విషయంలో నిన్ననే మంత్రిగా ప్రమాణం చేసిన ఛగన్ భుజబల్ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు బీజేపీ ఇంతకుముందు కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణలో ఉంది. ఈడీ సైతం ఆయనపై మరో కేసు నమోదు చేసింది. భుజబల్ శివసేనతో రాజకీయ జీవితం ప్రారంభించి...తర్వాత కాంగ్రెస్ తీర్థం తీసుకొని...చివరికి ఎన్‌సీపీలో స్థిరపడ్డారు. ఈ కేసులో భుజబల్‌ను అరెస్టు చేసి రెండేళ్లు జైలుకు పంపారు. అజిత్ మాదిరిగా ఎంవీఏ ప్రభుత్వం భుజబల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చింది. ముంబై యూనివర్సిటీ అవినీతి కేసులోనూ భుజ్‌బల్ నిందితుడు. మరోమంత్రి హసన్ ముష్రిఫ్‌పై ఈడీ కేసులు కొనసాగుతున్నాయి. అజిత్ పవార్‌తో పాటు బీజేపీ పంచన చేరిన ఎన్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ సైతం ఈడీ కేసులు ఎదుర్కొంటున్నారు. ప్రఫుల్ పటేల్ ఆస్తులను ఈడీ గతేడాది అటాచ్ చేసింది. ఈ మొత్తం పరిణామాలపై ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ నేరుగా ప్రధాని నరేంద్రమోదీని ప్రశ్నించారు. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న ఎన్‌సీపీ నేతలను ఎలా చేర్చుకున్నారని నిలదీశారు. బీజేపీలో చేర్చుకోవడం వల్ల కొంతమంది ఫిరాయింపుదారులకు క్లీన్‌చిట్ ఇచ్చినందుకు మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

శాంతి స్థాపనకు చర్యలేవు

మణిపూర్‌లో హింసకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసాకాండ మతపరమైనది కాబోదని, దానిని రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) విమర్శించింది. రాష్ట్రంలో శాంతి స్థాపన కోసం ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోవడంలేదని దుయ్యబట్టింది. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ త్రిసభ్య బృందం హింస ప్రభావిత రాష్ట్రంలో జూన్ 28 నుంచి జులై 1వ తేదీ వరకు పర్యటించింది. ఈక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా సోమవారం దిల్లీలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మణిపూర్ తాజా పరిస్థితికి కేంద్రంతో పాటు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు, చర్చలు జరిపేందుకు పూనుకోవాలని మణిపూర్ ప్రభుత్వాన్ని కోరారు. అన్ని సంఘాలు, వ్యక్తుల వద్ద ఆయుధాలు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. సాధ్యమైనంత త్వరగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయాలని, పునరావాస కేంద్రాల్లో పరిస్థితులను వెంటనే మెరుగుపర్చాలని ప్రభుత్వానికి సూచించారు. 'మణిపూర్‌లో జరుగుతున్న మత హింసగానీ రెండు వర్గాల మధ్య పోరుగానీ కాదు. ఇది భూమి, వనరులు, మిలిటెంట్లకు సంబంధించిన వ్యవహారం. హింసను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అక్కడి పోలీసుల తీరును పరిశీలించిన తర్వాతే ఈ విషయాన్ని చెబుతున్నాం. వాళ్లు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. కళ్ల ఎదుట ఘర్షణలు జరుగుతున్నా మిన్నకుండిపోతున్నారు. ఈ వైఖరి మయితె, కుకీ వర్గీయులకు కోపం తెప్పించింది. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలి' అని అనీరాజా అన్నారు. కాగా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ బృందం ఇంఫాల్ ఈస్ట్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని, అక్కడి మూడు పునరావాస కేంద్రాలను, బిష్ణుపూర్, మెయిరంగ్‌లోని రెండు క్యాంపులను, జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని, ఐఎంఏ మార్కెట్‌ను సందర్శించి స్థితిగతులను అధ్యయనం చేసింది. అలాగే చురచాంద్పూర్, బిష్ణుపూర్ జిల్లాల కలెక్టరేట్లకు వెళ్లింది. మణిపూర్ బాప్టిస్ట్ కన్వెన్షన్ సెంటర్ చర్చ్, క్యాథలిక్ బిషప్ హౌస్‌లనూ సందర్శించింది. మయితె, కుకీ వర్గాల మధ్య అపనమ్మకాన్ని అదునుగా చేసుకొని సంఘవిద్రోహ శక్తులు, తీవ్రవాదులు రెచ్చిపోతున్నాయని మణిపూర్‌లో పర్యటించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ బృంద సభ్యులు దీక్షా ద్వివేది, నిషా సిద్ధూ తెలిపారు. అన్ని పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిలో ఏ ఒక్కరికీ నష్టపరిహారం అందలేదని, క్యాంపుల్లో కనీస వసతులు లేవన్నారు. క్యాంపులకు ప్రభుత్వ సాయం అరకొరగానే ఉందని, పౌర సంఘాలు, దాతల ద్వారా అవి నడుస్తున్నాయని చెప్పారు. క్యాంపుల్లో ఉన్నది సామాన్యులు, దినసరి కూలీలేనన్నారు. నెల రోజుల పసికందు నుంచి 80ఏళ్ల వృద్ధుల వరకు ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. గర్భిణులు అనేకమంది ఉన్నారని, ప్రభుత్వమిచ్చే ఆహారం ఏ మాత్రం చాలదన్నారు. రెండు వర్గాల ప్రభావిత ప్రాంతాల మధ్య బఫర్ జోన్ ఏర్పాటు చేయాలని, రెండు వైపుల ఒకే దళాన్ని మోహరించాలని డిమాండ్ చేశారు. మే3వ తేదీ నుంచి ఈశాన్య రాష్ట్రం తగులబడిపోతున్న విషయం విదితమే.

అజిత్‌పై అనర్హత వేటు కోరాలి

- 8 మంది ఎమ్మెల్యేలపై కూడా...
- ఎన్‌సీపీ తీర్మానం... నోటీసుల జారీకి నిర్ణయం
- స్పీకర్ ముందు అభ్యర్థన దాఖలు

ముంబై: ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణం చేసిన అజిత్ పవార్‌తో పాటు మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ ముందు అభ్యర్థన దాఖలు చేసింది. అధికార కూటమిలో అజిత్ పవార్ చేరిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఎన్‌సీపీ నియమించిన జితేంద్ర అవద్ ఆదివారం అర్ధరాత్రి నార్వేకర్ నివాసంలో వినతి పత్రాన్ని అందించినట్లు వర్గాలు తెలిపాయి. ఈ విషయమై సంప్రదించినప్పుడు, నార్వేకర్ కార్యాలయం పిటిషన్ స్వీకరించినట్లు ధ్రువీకరించింది. సోమవారం శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు ఎన్‌సీపీతో ఏదైనా సంబంధం ఉందని ఏ వేదిక ముందు తప్పుడు ప్రచారం చేయవద్దని కోరుతూ నోటీసులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు జయంత్ పాటిల్ జారీ చేసిన లేఖలో 'అలాంటి తప్పుగా సూచించడం పూర్తిగా చట్టవిరుద్ధం' అని పేర్కొంది. అందువల్ల, 'భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం మహారాష్ట్ర శాసనసభ నుంచి ఈ ఎమ్మెల్యేలపై అధికారికంగా అనర్హత వేటు వేయడానికి పార్టీ ఆదివారం తగిన చర్యలను ప్రారంభించింది' అని కూడా ఆ లేఖలో పేర్కొంది. తొమ్మిది మంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని ఎన్‌సీపీ క్రమశిక్షణా కమిటీ ఆదివారం తీర్మానం చేయగా, కమిటీ అధ్యక్షుడు జైప్రకాష్ దండేగావ్కర్ దానిపై నివేదికను శరద్ పవార్‌కు సమర్పించారు. 'తొమ్మిది మంది ఎమ్మెల్యేల ఈ చర్యలు తక్షణమే అనర్హత వేటు వేయాలని పిలుపునిస్తున్నాయి. అటువంటి ఫిరాయింపులు పార్టీని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా, సభ్యులుగా కొనసాగడానికి అనుమతించినట్లయితే, వారు పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నం కొనసాగించే అవకాశం ఉంది' అని తీర్మానం పేర్కొంది. 'పార్టీ అధ్యక్షుడికి తెలియకుండా లేదా సమ్మతి లేకుండా' ఈ ఫిరాయింపులు చాలా గోప్యంగా జరిగాయని, ఇది పార్టీని విడిచిపెట్టినట్లు అవుతుందని, ఇది అనర్హతను ఆహ్వానిస్తుందని తెలిపింది. 'మేము అదే విషయాన్ని పరిగణలోకి తీసుకుంటాము. పార్టీ రాజ్యాంగం, నిబంధనలకు అనుగుణంగా భారత రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు అనుగుణంగా నేరుగా తగిన చర్యలు తీసుకోవచ్చు. విధివిధానాల ప్రకారం, పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్‌కు సమాచారం అందించారు. దానికోసం సంప్రదింపులు జరిపారు' అని తీర్మానంలో పేర్కొన్నారు. అజిత్ పవార్‌తో పాటు మరో ఎనిమిది మందిపై తమ పార్టీ అనర్హత వేటు వేసినట్లు మహారాష్ట్ర ఎన్‌సీపీ అధ్యక్షుడు జయంత్ పాటిల్ ఆదివారం తెలిపారు. ఎన్‌సీపీ శ్రేణులు పార్టీ అధినేత శరద్ పవార్‌తోనే ఉన్నాయని తెలియజేస్తూ భారత ఎన్నికల కమిషన్‌కు ఇ-మెయిల్ కూడా పంపినట్లు ఆయన చెప్పారు. ఆదివారం శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ శ్రేణులను విచ్ఛిన్నం చేసి శివసేన-బీజేపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేరిన తర్వాత 1999లో శరద్ పవార్ స్థాపించిన పార్టీ చీలిపోయింది. ఛగన్ భుజ్‌బల్, దిలీప్ వాల్సే పాటిల్ వంటి గట్టి శరద్ పవార్ విధేయులు సహా ఎనిమిది మంది ఎన్‌సీపీ ఎమ్మెల్యేలు మంత్రులు అయ్యారు.

ఎంపీలు ప్రఫుల్ పటేల్, తట్కరేను తొలగించాం : శరద్ పవార్

అజిత్ పవార్ తిరుగుబాటులో అతని పక్షం వహించినందుకు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ ప్రఫుల్ పటేల్, ఎంపీ తట్కరేను ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ సోమవారం తొలగించారు. ఏక్‌నాథ్ షిండే-బీజేపీ ప్రభుత్వంలో అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా, ఎన్‌సీపీ 8 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరిన ఒక రోజు తర్వాత ఈ చర్య జరిగింది. ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల్లో తట్కరే కుమార్తె అదితి కూడా ఉన్నారు. శరద్ పవార్ ఒక ట్వీట్‌లో 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు సునీల్ తట్కరే, ప్రఫుల్ పటేల్ పేర్లను ఎన్‌సీపీ పార్టీ సభ్యుల రిజిస్టర్ నుంచి తొలగించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నేను ఆదేశిస్తున్నాను' అని పేర్కొన్నారు. గత నెలలో ఎన్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన రాజ్యసభ ఎంపీ పటేల్‌ను, ఎంపీ తట్కరేను ఆయన తన ట్వీట్‌లో ట్యాగ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.